31 . 10. 2025
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
శుక్రవారం | రంగారెడ్డి , నల్లగొండ
సంపుటి :07 సంచిక : 151 , పేజీలు : 12 వెల:రూ.5/-
SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH
తెలుగు దిన పత్రిక
www.velthuru.com
velthuru Newspaper




## సూప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ నోటిఫికేషన్ విడుదల

**న్యూఢిల్లీ,అక్టోబర్ 30( వెలుతురు):** సూప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మ గురువారం నోటిఫికేషన్

# 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

- కల్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యాన్ని గోదాములకు తరలించాలి
- అవసరమైతే ఫంక్షన్ హాళ్లలో ధాన్యం నిల్వ చేయండి
- తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేయండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ ఆదేశాలు



## రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్

- అధికారులు క్షేత్రస్తాయిలో పర్యటించాలి
- నష్టాలను అంచనా వేసి వివరాలను తెలియచేయాలి
- విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలి
- వివరాలు ఎప్పటికప్పుడు మంత్రులకు చేరవేయాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్ రెడ్డి
- నేడు వరంగల్, హుస్నాబాద్‌లలో సిఎం పర్యటన

రాష్ట్రంలో ఈసారి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగినట్లుగా పౌరసరఫరాల విభాగం కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. వర్షంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయిందని, ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోవటం రైతులు నష్టపోవటం ఆందోళన కలిగించిందని అన్నారు. కల్లాల్లో, ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే దగ్గర్లోని గోదాములు, మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మిల్లుల, గోదాములు అందుబాటులో లేని చోట దగ్గరలో ఉన్న ఫంక్షన్ హాళ్లలో నిల్వ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికో ఇన్చార్జి అధికారిని నియమించాలని, ఇప్పుడున్న ఇన్చార్జీలు నిర్లక్ష్యంగా ఉంటే వెంటనే వేరే వాళ్లను నియమించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతీ ఐకేపీ సెంటర్ నుంచి ఏరోజుకారోజు సాయంత్రం రిపోర్టు తెప్పించుకోవాలని, రిపోర్ట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను అప్రమత్తం చేశారు.

**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు):** అధికారులు, ఉద్యోగుల సెలవులు రద్దు చేసి అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించేలా, ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాలకు ధాన్యం తడవకుండా తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. విధానపరమైన నిర్ణయాలు అవసరమైతే వెంటనే సివిల్ సప్లయిస్ కమిషనర్, సీఎస్ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వరద తగ్గిన తర్వాత వ్యవసాయ, రెవిన్యూ విభాగం అధికారులు సంయుక్తంగా సర్వేలు చేసి నష్టపు అంచనాలు తయారు చేయాలని నివేదించారు. ఎంతటి విపత్తు వచ్చినా ప్రజలను ఆదుకునేందుకు జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. ఇప్పటికే రాష్ట్రంలో 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణ

## వరంగల్ ముంపు ప్రాంతాల్లో పోలీస్ సేవలు

- హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను పంపించండి
- తక్షణ సహాయక చర్యలకు పడవలను పంపించాలి
- వరదల్లో చిక్కుకున్న వారికి డ్రోన్ల సాయంతో ఆహారం
- సీఎస్, డీజీపీకి ఆదేశించిన సిఎం రేవంత్ రెడ్డి

శాఖ హెచ్చరించిందని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. వర్షాలతో పాటు ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే విద్యుత్తు పునరుద్ధరించేలా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వర్షాలతో ఖమ్మం జిల్లాలో ఒక డీసీఎం వ్యాన్, డ్రైవర్ వాగులో కొట్టుకుపోవటం దురదృష్టకరమని సీఎం అన్నారు. అన్ని రోడ్లు, రహదారులపై ఉన్న బ్రిడ్జిలు, లో లెవల్ కాజ్ వేలు, కల్వర్టుల వద్ద అప్రమత్తంగా ఉంటే ఇలాంటి ఘటనలను నివారించవచ్చని సీఎం అన్నారు. రోడ్లు, రహదారులపైకి వరద నీళ్లు వచ్చే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలు అటువైపు వెళ్లకుండా పోలీసులు నిషేధాజ్ఞలు అమలు చేయాలన్నారు. స్థానిక సీఐ, రెవిన్యూ అధికారులు వాహనాలు అటువైపు వెళ్లకుండా రెండు వైపులా బారికేడ్లు పెట్టాలన్నారు. దెబ్బతిన్న రోడ్ల వద్ద ట్రాఫిక్ ను డైవర్ట్ చేయాలని, కుంభ వృష్టి కురిసే సమయంలో ప్రజలు అవసరమైతే తప్ప రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని అన్నారు. వైద్యారోగ్య



## గాంధీజీ సత్యాగ్రహం స్పూర్తితో ఎన్డీఏను తరిమికొట్టండి

బీహార్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి పిలుపు

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:** భారతదేశం నుంచి బ్రిటిష్ పాలకులను తరిమి కొట్టడానికి మహాత్మా గాంధీజీ 1917లో చంపారన్ జిల్లా వేదికగా

## మొంథా తుఫాన్ ప్రభావంతో 4,47,864 ఎకరాల్లో పంట నష్టం

- వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాల్లో ఎక్కువగా పంట నష్టం
- వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక పంట నష్టం వివరాలు వెల్లడి
- నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటాం
- మంత్రి తుమ్మల



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:** మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పంట నష్టంపై ప్రాథమిక

## టీజీ సెట్ - 2025 దరఖాస్తు గడువును పొడగింపు

**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు):** తెలంగాణ రాష్ట్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ లెక్చరర్‌షిప్‌కు అర్హత సాధించేందుకు నిర్వహించే టీజీ సెట్ - 2025 దరఖాస్తు స్వీకరణ



## జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి

ఎక్స్ వేదికగా కెటిఆర్ ఘాటు విమర్శలు

**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసమే మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎట్టకేలకు క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహిస్తున్నట్లు కనిపిస్తున్నదని చెప్పారు.

# జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

- మైనార్టీ ఓట్లకు గాలం వేసిన కాంగ్రెస్
- అజారుద్దీన్‌కు మంత్రి పదవిపై విమర్శలు
- బిజెపి, బిఆర్ఎస్‌ల తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం



**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు):** నవంబర్ 11వ తేదీన జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల బరిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపాయి. అయితే ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించి.. తమ సత్తా చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ఇక బీఆర్ఎస్ పార్టీ ఈ స్థానాన్ని మళ్లీ కైవసం చేసుకోవాలని కృత నిశ్చయంతో ఉంది. అందుకోసం ఈ అసెంబ్లీ స్థానం నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మాగంటి గోపినాథ్ గెలిచారు. అనారోగ్య కారణంగా ఆయన జూన్‌లో మరణించారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య సునీతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించింది. అలాగే బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డిని బరిలో నిలిపింది. గత ఎన్నికల్లో ఆయన ఇదే స్థానం నుంచి గెలిచి మూడో స్థానంలో ఆయన నిలిచిన విషయం విదితమే. మరో వైపు ఈ నియోజకవర్గంలో అభ్యర్థి గెలుపుపై మైనార్టీల ఓట్లు అధిక ప్రభావం చూపిస్తుంది. కానీ రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ముస్లిం మంత్రి ఒక్కరు

## ఈ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి...

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి... భారీ మెజార్టీతో గెలిపించండి

జూబ్లీహిల్స్ ఓటర్లకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి






## నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

- అజారుద్దీన్ కోసం ప్రత్యేకం
- రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఏర్పాట్లు

**హైదరాబాద్దె,అక్టోబర్ 30( వెలుతురు):** తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15



## అజారుద్దీన్‌పై ఎందుకీ అక్కసు

- బిజెపి తీరుపై మండిపడ్డ కాంగ్రెస్
- దేశానికి కీర్తి తెచ్చిన ఘనత అజ్జాదన్న భట్టి
- బిజెపి విమర్శలను కొట్టి పారేసిన పిసిసి చీఫ్

**హైదరాబాద్దె,అక్టోబర్ 30( వెలుతురు):**

## తుపాన్‌తో వరిపంటకు తీవ్ర నష్టం


- పైరు పొట్ట దశలో ఉండగా తుపాను దెబ్బ
- 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి
- రైతులకు తోడుగా నిలబడాలని పార్టీ నేతలకు జగన్ పిలుపు



**అమరావతి,అక్టోబర్ 30( వెలుతురు):** తుపాను కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మోంథా తుపాను నేపథ్యంలో పార్టీ నేతలతో వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంపై పార్టీ నేతలతో చర్చించారు. పైరు పొట్ట దశలో ఉన్నప్పుడు తుపాను దెబ్బపడింది. దీనివల్ల దిగుబడులు బాగా

# తుపాను నష్టం రూ.5,265 కోట్లు

- వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు
- ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం
- ముందస్తు చర్యలతో నష్టాన్ని నివారించాం
- సకాలంలో విద్యుత్ పునరుద్ధరించాం
- అధికారులు సమన్వయంతో పనిచేయడంతో తప్పిన ముప్పు
- అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు



**అమరావతి,అక్టోబర్ 30 (వెలుతురు):** 'మొంథా' తుపాను వల్ల రాష్ట్రానికి రూ.5,265 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేశామని, అందుకే నష్టం తగ్గిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు, ఆర్అండ్‌బీకి రూ.2,079 కోట్ల మేర నష్టం వాటిల్లిందని



## చంద్రబాబు ముందస్తు చర్యలతో నష్టనివారణ

- 46 వేల హెక్టార్లలో వరికి నష్టం కలిగింది
- 14 వేల హెక్టార్లలో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- కృష్ణాజిల్లా అవనిగడ్డలో పర్యటించిన డిప్యూటి సిఎం
- బాధిత రైతులతో మాట్లాడి భరోసా ఇచ్చిన పవన్ కళ్యాణ్

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్

విడుదల చేశారు. నవంబర్ 24వ తేదీన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఈ పదవిలో ఉన్న బీఆర్ గవాయ్ నవంబర్ 23వ తేదీన రిటైర్ కానున్నారు. అయితే సుప్రీంకోర్టులో జస్టిస్ సూర్యకాంత్ సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్‌ను నియమించాలంటూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ బీఆర్ గవాయ్ బుధవారం సిఫార్సు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సిఫార్సు చేసిన కొన్ని గంటల్లోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా వెల్లడించారు. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రసాదించిన అధికారాలను వినియోగించి.. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను రాష్ట్రపతి నియమించారని తెలిపారు. 2025, నవంబర్ 24వ తేదీన భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా బాధ్యతలు చేపట్టనున్న ఆయనకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

## మొంథా తుఫాన్ ప్రభావంతో 4,47,864 ఎకరాల్లో పంట నష్టం

నివేదికను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు.తుఫాన్ ప్రభావంతో 12 జిల్లాల్లో 179 మండలాల్లో 2,53,033 మంది రైతులకు చెందిన 4,47,864 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు, పూర్తి స్థాయిలో సర్వే కి ఆదేశించినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. పంట నష్టం ప్రాథమిక వివరాలు చూస్తే వరి 2,82,379 ఎకరాల్లో పత్తి 1,51,707 ఎకరాల్లో నష్టపోయినట్లు నివేదికలో తెలిపారు. పంట నష్టం ఎక్కువగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోటు చేసుకుంది.1,30,200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లగా ,తరువాత స్థానంలో ఖమ్మం జిల్లా 62,400 ఎకరాల్లో, నల్గొండ జిల్లాలో 52,071 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదికలో తెలిపారు.

నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటాం: మంత్రి తుమ్మల

మొంథా తుఫాన్ ప్రభావంతో నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు.వరద ప్రభావిత జిల్లాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటిస్తారని రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తుమ్మల ప్రకటించారు.ఎకరాకు ఎంత పంట నష్ట పరిహారం ఇవ్వాలో సీఎం రేవంత్ రెడ్డి తో చర్చించి నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి తుమ్మల వెల్లడించారు.

## టీజీ సెట్ - 2025 దరఖాస్తు గడువును పొడగింపు

గడువును పొడగించినట్లు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ బి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా వచ్చే నెల 6వ తేదీలోగా ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రూ.1500 అపరాధ రుసుముతో 14వ తేదీ వరకు, రూ.2000 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు, రూ.3000 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులు ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. డిసెంబర్ నెల రెండో వారంలో పరీక్షలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు 0040-27097733, 8331040950 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## జూబ్లీహిల్స్ కోసమే అజార్‌కు మంత్రి పదవి

అందుకే పూర్తిగా దిగజారిన పార్టీ పరువును కాపాడుకోవడానికి అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఆపద మొక్కులు మొక్కుతున్నదని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం సినీ కార్మికులకు అడ్డగోలు వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వీధుల్లో హడావుడిగా తిరగడం వంటివి ఆ పార్టీ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతేనే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేస్తుందన్నారు. అందుకే కాంగ్రెస్, దాని నాయకత్వానికి గుణపాఠం చెప్పడానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సరైన వేదిక అని చెప్పారు. ఈమేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

## తుపాన్‌తో వరిపంటకు తీవ్ర నష్టం

దెబ్బతింటాయి. నేలకొరిగిన పంట తిరిగి నిలబడం కష్టమయ్యే పరిస్థితి. దాదాపు 25 జిల్లాల్లో ప్రభావం చూపింది. ఉన్న సమాచారం ప్రకారం 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 11 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. 1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరు శనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.9 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నాయి. పార్టీ పరంగా రైతులకు తోడుగా నిలబడాలని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. మన ప్రభుత్వంలో ఆర్బీకేలు వ్యవస్థ అప్రమత్తంగా ఉండేది. ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేసే వాళ్లం. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు సమన్వయం తో గట్టిగా పనిచేసేది. ఉచిత పంటలబీమాతో రైతులకు భరోసా ఉండేది. 80 లక్షల మంది రైతులు ఉచిత పంటల బీమా అందుబాటులో ఉండేది. 70 లక్షల ఎకరాల పంట బీమా పరిధిలో ఉండేది. ఇవాళ ప్రీమియం కట్టిన రైతులు 19 లక్షలమందికి మాత్రమే బీమా అందుబాటులో ఉంది. మిగిలిన రైతుల పరిస్థితి ఏం కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు మనం అండగా ఉండాలన్నారు. 16 నెలల్లో అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్లు కారణంగా 16 వచ్చాయి. ఎంతమందికి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందింది, నష్టపోయిన రైతులను ఎంతమందిని ఆదుకున్నారు చూస్తే.. గుండుసున్నాయే కనిపిస్తుంది. ఏ రైతునూ ఆదుకున్న పరిస్థితి లేదు. ఇ-క్రాప్ అందించిన పరిస్థితి కూడా లేదు. వాళ్లు వేసిన అరకొర లెక్కల ప్రకారమే 5.5 లక్షలమంది రైతులకు రూ.600 కోట్లు పెండింగ్‌లో పెట్టారు. మిర్చికి క్వింటాలుకు రూ.11,781కి కొనుగోలు చేస్తామన్నారు ఒక్క రూపాయికూడా రైతుకు ఇవ్వలేదు. పొగాకును కొనుగోలు చేస్తాం న్నారు దిక్కూ మొక్కూ లేదు. మామిడిని కిలో రూ.12కు కొనుగోలు చేస్తామన్నారు. ఒక్క రైతుకూ మంచి చేయలేదు. తర్వాత హెక్టారుకు రూ.50వేలు ఇస్తామన్నారు. అధికారం ఇచ్చిన పాపాన పోలేదని జగన్ విమర్శించారు.

## చంద్రబాబు ముందస్తు చర్యలతో నష్టనివారణ

**విజయవాడ,అక్టోబర్ 30( వెలుతురు):**

ముందస్తుగా తీసుకున్న చర్యలతో తుఫాన్ నష్ట నివారణ కొంత వరకు తగ్గించగలిగామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎలర్ట్ మెసేజ్ లు కూడా పంపామని.. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేసిందని కొనియాడారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు.కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో పర్యటించారు. 'మొంథా' తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా ఉన్నారు. అలాగే పునరావాస కేంద్రాల్లో ఉన్న నష్టపోయిన రైతులను పరామర్శించారు. మొంథా తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా పంట నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... మొంథా తుపాను ప్రభావంతో 46 వేల హెక్టార్లలో వరి, 14 వేల హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బ తిన్నాయని వెల్లడించారు. చెట్టు మీద పడి కోయ సుబ్బారావు అనే వ్యక్తి చనిపోవడం బాధాకరమన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బియ్యం ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించామని అన్నారు. ఇళ్లకు వెళ్లే సమయంలో కూడా ఒక్కో కుటుంబానికి మూడు వేల రూపాయలు ఇస్తున్నామని చెప్పారు. డ్రైన్ పూడికతీత ద్వారా నీరు నిల్వ లేకుండా చేశామన్నారు. ముందస్తుగా తీసుకున్న చర్యల వల్ల నేడు నష్టం చాలా వరకు తగ్గించిన డిప్యూటీ సీఎం తెలిపారు. ఆక్వా రైతుల ఇబ్బందులు తన దృష్టికి వచ్చాయని.. సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో రోడ్లు పాడైతే యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తామన్నారు. రెండు రోజుల్లో మొత్తం చెత్తను క్లీన్ చేసేలా వేలాది మంది సిబ్బంది పని చేస్తున్నారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

శాఖ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రధానంగా వరి, పత్తి పంటకు నష్టం వాటిల్లిందని మంత్రులు, కలెక్టర్లు ముఖ్యమంత్రికి వివరించారు. ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాతో పాటు, హుస్నాబాద్ నియోజకవర్గంలో వరద నష్టం ఎక్కువగా ఉందని అంచనాకు వచ్చారు. అన్ని చోట్ల వరి కోతలు మొదలయ్యాయని, అనుకోని ఉపద్రవం ఏది వచ్చినా రైతులకు ఆవేదన మిగులుస్తుందని సీఎం అన్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న జిల్లాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ కూడా ప్రాణనష్టం జరగకుండా చూడాలని, పశువులకు ఆపద రాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ముంపు గ్రామాలు, కాలనీల్లో ఉంటున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగిన సహాయం అందించాలని ఆదేశించారు.

### వరంగల్ ముంపు ప్రాంతాల్లో పోలీస్ సేవలు

వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మొంథా తుపాను వరంగల్ జిల్లాను ముంచెత్తింది. భారీ వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో జిల్లాలో వరదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని అన్నారు. వరంగల్ జిల్లాకు వెళ్లనున్న సీఎం... వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. కాగా.. వరంగల్ నగరాన్ని మొంథా తుపాను అతలాకుతలం చేసింది. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. అనేక ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరంగల్ నగరంలోని 30 ముంపు కాలనీలతో పాటు హనుమకొండలోని 15 ముంపు కాలనీవాసులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు డిజాస్టర్ సిబ్బంది తరలించింది. హనుమకొండలో మూడు పునరావాస కేంద్రాలు, వరంగల్లో 9 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1200 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రేటర్ పరిధిలో ఏడు ప్రత్యేక బృందాలను వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ ఏర్పాటు చేసింది. ఏడు బృందాల ద్వారా సహాయ చర్యలను సిబ్బంది చేపట్టింది. మరోవైపు భారీ వర్షం నేపథ్యంలో పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు.

### రైతులకు వేదన మిగిల్చిన తుఫాన్

ఇది వరి కోతల కాలం..కానీ అనుకోని ఉపద్రవం రైతులకు ఆవేదన మిగులుస్తోందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అధికారుల అందరి సెలవులు రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లకు ఆదేశించారు. ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, జరిగిన నష్టాన్ని జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. దెబ్బతిన్న పంటలు, రహదారులకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కేంద్ర ప్రభుత్వం నుంచి పొందే వరదసాయం అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహిస్తానని సీఎం రేవంత్ తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు చెప్పారు. తుపాను ప్రభావిత జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని.. దానికి అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సీఎం తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 16 జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని తెలిపారు. దీనిపై ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రోడ్లపై బ్రిడ్జిలు, లోలెవల్ కాజ్‌వేల వద్ద వరద నీరు నిలిచినా, రోడ్లు దెబ్బతిన్నా.. ట్రాఫిక్‌ను డైవర్ట్ చేయాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. అవసరమైతే తప్ప ప్రజలు రోడ్లపైకి రాకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైనచోట అత్యవసర వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అవసరమైన చోట హైడ్రా సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. 24 గంటలు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో సమన్వయం చేసుకుని ఉమ్మడి జిల్లాల మంత్రులు, కలెక్టర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలాగే.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధింత జిల్లా ఇంచార్జ్ మంత్రికి తెలియజేయాలని పేర్కొన్నారు. కాలువలు, వాగులు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజలను అప్రమత్తం చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ప్రాజెక్టుల ఇన్ ఎ÷-లో, అవుట్ ఎ÷-లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వివరించారు. ప్రాణనష్టం, పశు నష్టం, పంట నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి ప్రాణాలకు నష్టం జరగడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇవాళ్టి వరంగల్ ఆకస్మిక పర్యటన వాయిదా వేసుకున్నట్లు రేవంత్ వెల్లడించారు. శుక్రవారం వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధికారులు బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను సిద్ధం చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# గాంధీజీ సత్యాగ్రహం స్ఫూర్తితో ఎన్డీఏను తరిమికొట్టండి

సత్యాగ్రహాన్ని ప్రారంభించారని అదే స్ఫూర్తితో నేడు బీహార్ రాష్ట్రంలో ఎన్డీఎ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని కాంగ్రెస్ బీహార్ ఎన్నికల పరిశీలకులు, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. చరిత్రాత్మక సంఘటనకు కారణమైన చంపారన్ జిల్లా నుంచే మహాగట్ బంధన్ గెలుపునకు బాటలు వేయాలని ఆయన కోరారు. బీహార్ రాష్ట్రం పశ్చిమ చంపారన్ జిల్లాలోని చనుపటియా ,భాగా అసెంబ్లీ నియోజకవర్గాలలో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రిగారు మాట్లాడుతూ “ప్రజలలో స్పష్టమైన మార్పు వాతావరణం కనిపిస్తుందని ప్రతి ఊర్లో, ప్రతి వీధిలో మహాగట్‌బంధన్ కూటమికి అద్భుతమైన ప్రజా మద్దతు లభిస్తోందని నవంబర్ 6, 11 తేదీల్లో జరగబోయే ఎన్నికల్లో మహాగట్ బంధన్‌ను భారీ మెజార్టీతో బీహార్ ప్రజలు గెలిపించబోతున్నారని అవకాశవాద రాజకీయాలకు బీహార్ ప్రజలు ముగింపు పలకడం ఖాయమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు లేక వలసలు పోతున్నవేళ మహాగట్ బంధన్ తమ ఎన్నికల ప్రణాళిక ఇంటికో ఉద్యోగాన్ని ఇస్తామంటూ ప్రకటించడంతో ఇప్పుడు యువతలో ఆశలు చిగురిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని 7.40 కోట్ల మంది ఓటర్లను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా ఎన్నికల ప్రణాళిక రూపొందించామని, మహిళల కోసం ప్రకటించిన పథకాలు సరికొత్త అధ్యయనాన్ని లిఖించబోతున్నాయని మంత్రి పొంగులేటి అన్నారు. తాము పర్యటిస్తున్న ప్రాంతాల్లో ప్రజలు మహాగట్ బంధన్ కూటమికి మద్దతు తెలుపుతున్నారని , తమ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజలను , ముఖ్యంగా ఓటర్లను విశేషంగా చైతన్యపరిచారని అదే రాబోయే గెలుపునకు మూల సూత్రమని మంత్రి పొంగులేటి అభిప్రాయపడ్డారు. బీహార్ భవిష్యత్తు బీహార్ ప్రజలు చేతుల్లో ఉంది. ప్రజలు రాబోయే తరం కోసం మార్పును ఎంచుకోబోతున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సమావేశాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఏఐసిసి పరిశీలకులు బీవీ శ్రీనివాస్, చంపారన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రమోద్ సింగ్ పటేల్, అఖిల భారత యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోకో పాధి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల ప్రచార పత్రాన్ని మంత్రి పొంగులేటి తదితరులు విడుదల చేశారు.

# అజారుద్దీన్‌పై ఎందుకీ అక్కసు

మంత్రివర్గ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ భాజపా నేతలు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో)ను ఆశ్రయించడాన్ని కాంగ్రెస్ నేతలు ఖండించారు. ఇందులో అజారుద్దీన్‌కు కేబినెట్‌లో స్థానం కల్పించవద్దనే కుట్ర కనిపిస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. అజారుద్దీన్ హైదరాబాద్ బిడ్డ అని, మన కీర్తిపతాకలను రెపరెపలాడించిన వ్యక్తి అని పేర్కొన్నారు. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవద్దని లేఖలు రాస్తున్నారు. దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన క్రీడాకారుడని అన్నారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచపటంలో నిలబెట్టారు. ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకుంటే ఎవరైనా స్వాగతించాలి. కానీ.. మంత్రివర్గంలోకి తీసుకోవద్దని లేఖ రాయడం దురదృష్టకరం అంటూ విమర్శించారు. భారత రాష్ట్ర సమితిని గెలిపించడంలో భాగంగానే భాజపా నేతలు లేఖ రాశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాజపాకు భారాస సహకరించింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భాజపా ఎలాగూ గెలవదు కాబట్టి బలహీన వ్యక్తిని నిలబెట్టింది. అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోకుండా గవర్నర్‌పైనా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో అన్నారు. ఇంతకన్నా దారుణం ఏముంటుందన్నారు. మైనార్టీలకు బిజెపి వ్యతిరేకమని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు.నాడు భారత క్రికెట్ జట్టుకు అజారుద్దీన్ సేవలందించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ గుర్తుచేశారు. అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి కేబినెట్‌లోకి తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మైనార్టీకి అవకాశమిస్తే అడ్డుతగిలేలా విషం వెళ్లగక్కుతున్నారు. ఈసీ వద్ద ఆపాలని భాజపా నేతలు ప్రయత్నిస్తున్నారు. గొప్ప క్రీడాకారుడికి మంత్రివర్గంలో అవకాశం వస్తుంటే అనైతికంగా అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. మైనార్టీ ఎమ్మెల్యేలు లేకపోవడంతో కేబినెట్‌లో అవకాశం ఆలస్యమైంది. అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకోవడం ద్వారా మైనార్టీలకు సంక్షేమానికి పాటుపడుతున్నాం. భాజపా ద్వంద్వ వైఖరిని ప్రజలు తెలుసుకోవాలి. ఎన్నికల వేళ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. రాజస్థాన్‌లో ఉపఎన్నిక వేళ భాజపా అభ్యర్థిని మంత్రిగా చేశారు. భాజపాకు రాజస్థాన్‌లో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఉంటుందా అని పిసిసి చీఫ్ ప్రశ్నించారు. అజారుద్దిన్‌ను కేబినేట్‌లోకి తీసుకుంటే బిజెపికి వచ్చిన నొప్పి ఏంటని మంత్రి పొన్నం అన్నారు. బిజెపి, బిఆర్ఎస్‌లవి ద్వంద్వ నీతి అని ఎద్దేవాచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, మర్రి శశిధర్ రెడ్డితో పలువురు బీజేపీ ప్రతినిధులు ఎన్నికల అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోడ్ ఉల్లంఘించారని ఆరోపించారు. ఇలా మంత్రి పదవి ఇవ్వడం వల్ల ఒక వర్గం ఓట్లు ప్రభావితం అవుతాయన్నారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. 'మంత్రివర్గ విస్తరణపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం, చర్యలు తీసుకోవాలని కోరాం. ఒక వర్గానికి మంత్రి పదవి ఇచ్చి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తున్నారు అంటూ ఫైర్ అయ్యారు పాయల్ శంకర్.

## హన్మకొండలో వరదబాధితుల ఆందోళన

**- మేయర్, కమిషనర్ల వాహనాలు అడ్డగింత**

**హనుమకొండ,అక్టోబర్ 30( వెలుతురు):**

హన్మకొండసమ్మయ్యనగర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కమిషనర్ చాహత్ , మేయర్ సుధారాణి వాహనాలను వరద బాధితులు అడ్డుకున్నారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తులసి బార్ దగ్గర గేట్లు ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. గోపాల్‌పూర్ చెరువు మత్తడి వద్ద గేట్లు మూసివేయడంతోనే గండిపడి వరద తీవ్రత పెరిగిందని సమ్మయ్య నగర్ వాసులు ఆందోళన చేపట్టారు. అధికారులు ముందస్తు చర్యలు చేపడితే ఈ పరిస్థితులు ఉండేవి కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, హనుమకొండలో వరద ఉద్రిక్తత ఏర్పడింది. మొంథా తుఫాన్ కారణంగా పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలకు రోడ్లు జలమయం అయ్యాయి. జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల ఇళ్ళలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణ శాఖ సైతం హనుమకొండ, వరంగల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది.

## ఈ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి...



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:**

రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, సీహెచ్ విజయ రమణ రావు, ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. గడిచిన రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, “రైజింగ్ తెలంగాణ” కోసం భవిష్యత్తు ప్రణాళికలను ప్రజలకు వివరించారు. ప్రతిపక్షాలు పనిగట్టుకొని కావాలని చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలే అజెండాగా పని చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి స్థానికంగా పాల్గొననున్న “కార్నర్ మీటింగ్” ఏర్పాట్లపై స్థానిక నాయకులతో కలిసి సమీక్షించారు. పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రతి వ్యూహాలపై కేడర్ కు దిశా నిర్దేశం చేశారు.

## నేడు తెలంగాణ కేబినేట్ విస్తరణ

గంటలకు కొత్త మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో కేబినెట్ మంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ఒక్కరే ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ప్రమాణస్వీకారోత్సవం జరిగే రాజ్‌భవన్ దర్బార్ హాల్‌ను ప్రోటోకాల్ అధికారులు పరిశీలించారు. మంత్రి ప్రమాణ స్వీకారానికి సీటింగ్ తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. 22 నెలల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తరువాత మరో ముగ్గురికి మంత్రులుగా అవకాశం ఇవ్వడంతో కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదవులపై కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేసింది. ఈ మూడు మంత్రి పదవుల్లో మైనారిటీ వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం ఇవ్వాలని హైకమాండ్ భావించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం, మైనారిటీ శాఖ ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక మంత్రివర్గంలో మరో రెండు ఖాళీలకు అధిష్టానం ఎప్పుడు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందో చూడాలి మరి. కాగా.. మైనారిటీని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో ఆలోచన ఉందని.. అందులో భాగంగానే అజారుద్దీన్ కేబినెట్‌లోకి తీసుకుంటున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తనకు హామీ ఇచ్చి పక్కన పెట్టారని రాజగోపాల్ రెడ్డి పదేపదే విమర్శలు చేస్తున్నా ఆయనకు మాత్రం అవకాశం దక్కకపోవడం గమనార్హం.

# న్యాక్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్స్

- శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికేట్ తో పాటు ఉద్యోగావకాశాలు
- అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్న రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:** హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (NAC) ఆధ్వర్యంలో, వారధి ట్రస్ట్ సహకారంతో ఉద్యోగావకాశాలతో కూడిన నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి,NAC వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సివిల్ సూపర్వైజర్ మరియు ఎలక్ట్రిషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయనీ, శిక్షణతో పాటు ఉచిత భోజనం,నివాసం మరియు వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికేట్ తో పాటు ఉద్యోగావకాశాలు అందించబడుతాయని,ఈ శిక్షణ కార్యక్రమం 03.11.2025 నుండి నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (NAC), హైదరాబాద్ లో ప్రారంభమవుతుందనీ మంత్రి తెలిపారు. శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం సంప్రదించవలసిన నంబర్లు: 8008937800 / 9032504507.

# సిద్దిపేట కలెక్టర్ కు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్

- అక్కన్నపేటలో ఇద్దరు గల్లంతుపై ఆరా
- ఎస్డీఆర్ఎఫ్ టీంలను పంపి గాలింపు చర్యలు చేపట్టాలని కోరిన కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ వెలుతురు అక్టోబర్ 30:** బుధవారం రాత్రి కురిసిన వర్షానికి హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి చెరువులో ఇద్దరు (భార్యభర్తలు) గల్లంతయ్యారనే సమాచారం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేశారు. ఆ ఇద్దరి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరూ భార్యాభర్తలని వారి బైక్ లభ్యమైందే తప్ప ఆచూకీ తెలియలేదని కలెక్టర్ వివరించారు. వెంటనే ఎస్డీఆర్ఎఫ్ టీంలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంలో అవసరమైతే అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. స్థానిక బీజేపీ శ్రేణులు సైతం సహాయక చర్యల్లో పాల్గొనాలని, వర్ష బాధిత ప్రాంతాల్లో పర్యటించాలని పిలుపునిచ్చారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఉత్సాహం ఎర్రగడ్డలో ప్రజా మద్దతు వెల్లువ

**ఎర్రగడ్డ డివిజన్ లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన డా. రేఖ బోయలపల్లి**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఉత్సాహం ఎర్రగడ్డలో ప్రజా మద్దతు వెల్లువ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచార కార్యక్రమం భాగంగా గురువారం రోజున ఎర్రగడ్డ డివిజన్‌లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, షబ్బీర్ అలీ, అలాగే రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు, డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు తెలంగాణ ప్రదేశ్ మహిళా, కాంగ్రెస్ స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రచారం సందర్భంగా డివిజన్ మరియు కాలనీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలపరచి, ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి – సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పేదలు, మహిళలు, యువతకు ఉపయోగపడే పథకాల గురించి వివరించారు. ప్రజలతో మమేకమై “ప్రతి ఓటు – అభివృద్ధి ఓటు” అనే నినాదంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ నాయకత్వంపై స్థానిక ప్రజల నుండి విశేషమైన స్పందన లభించింది. జూబ్లీహిల్స్ ప్రజల ఆశ నవీన్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజల భవిష్యత్తు

# మొథా తుఫాన్‌తో రోడ్లకు దెబ్బ

- 334 లోకేషన్స్‌లో 230 కి.మీ ధ్వంసం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు):** మొంథా తుఫాను ప్రభావంతో తో ఆర్ అండ్‌బీ రోడ్లు 334 లోకేషన్స్‌లో 230 కి.మీ దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలు శాఖ పూర్తి అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. తాజాగా తుఫాన్ ఎఫెక్ట్స్‌పై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి మాట్లాడారు. నిన్న అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు.. దెబ్బతిన్న, కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు, కాజ్‌వేల తాత్కాలిక పునరుద్ధరణకు సుమారు రూ. 7కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 225 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. తుఫాన్ వల్ల అకాల వర్షాలతో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి, పత్తి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని తెలిపారు. వరి ధాన్యం సుమారు 2లక్షల మెట్రిక్ టన్నులు ఐకేపీ సెంటర్లో ఉంది. మన ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం.. తడిసిన ధాన్యాన్ని కూడా కొని వెంటనే మిల్లులకు తరలించేలా ముఖ్యమంత్రి, సివిల్ సప్లై మినిస్టర్ చొరవ చూపాలి. సేకరించిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించేలా.. మిల్లర్లు వెంటనే ఆ ధాన్యాన్ని తీసుకునేలా చూడండి.. పత్తి తేమ శాతానికి సంబంధించి ఇప్పటికే సీసీఐ ఛైర్మన్ లలిత్ కుమార్ గుప్తాను ముంబై వెళ్లి మరి కలిసి రైతుల పక్షాన ప్రత్యేక విజ్ఞప్తి చేశాను.. తేమ శాతంలో సడలింపులు ఇచ్చి తెలంగాణ పత్తి రైతులను ఆదుకోవాలని కోరాను. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన ఉమ్మడి నల్గొండ జిల్లా రైతాంగంపై ప్రత్యేక దృష్టి సారించి వారిని ఆదుకోవాలని ముఖ్యమంత్రి కి రిక్వెస్ట్ చేస్తున్నాం.‘ అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షిష్టంగా ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని నిధులు విడుదల చేశాం

## ఒక్కో విద్యార్థికి ఓవర్సీస్ పథకం కింద రూ .20 లక్షలు ఇచ్చాం.



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:** ఓవర్సీస్ స్కాలర్ షిప్ బకాయిల విడుదల పై ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారి. ప్రెస్ మీట్ పాయింట్స్ గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో ఉంచుకుని నిధులు విడుదల చేశాం. ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులందరికీ విద్య ద్వారా సమాన అవకాశాలు వారి ఉజ్వల భవిష్యత్ కోసం మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఒక్కో విద్యార్థికి ఓవర్సీస్ పథకం కింద రూ .20 లక్షలు ఇచ్చాం. 2, 288 విద్యార్థులకు గాను, సుమారు రూ. 304కోట్ల నిధులు విడుదల చేశాం.( అక్టోబర్ 2025 లో ) ఇప్పటివరకు 3642 మంది విద్యార్థులకు గాను రూ.463 కోట్లు విడుదల చేశాం. ( ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసి) 2022 నుంచి ఈ రోజు వరకు బకాయిలను మొత్తంవిడుదల చేశాం. అర్హతకలిగిన విద్యార్థులకు నేరుగా వారు బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమవుతుంది. విదేశాల్లో ఉన్నత విద్యను కొనసాగిస్తున్న మన తెలంగాణ విద్యార్థులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించి ఓవర్సీస్ స్కాలర్ షిప్ నిధులను మా ప్రభుత్వం విడుదల చేయడం జరిగింది. ఈ నిధుల విడుదల ద్వారా విద్యార్థుల కలలను నేరవేర్చడంతో పాటు వారి కుటుంబాల్లో వెలుగులు నింపింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనను మా ప్రభుత్వం అర్థం చేసుకుంది. యూకే ,అమెరికా యూరప్ ఆస్ట్రేలియాతో పాటు పలు విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మా ప్రభుత్వం ఊరట కల్పించింది. ప్రస్తుతం విదేశాల్లో అననుకూల పరిస్థితుల కారణంగా మన రాష్ట్ర విద్యార్థులు పడుతున్న ఇబ్బందులకు ఈ నిధుల ద్వారా వారికి ఉపశమనం లభిస్తుంది. సంక్షేమ హాస్టల్స్ లో (ఎస్సీ ఎస్టీ బీసీ, మైనార్టీ) హాస్టల్స్ తక్షణ ఇబ్బందులను అధిగమించేందుకు రూ. 60 కోట్లు విడుదల చేశాం. ఇవి జిల్లా కలెక్టర్లు, సెక్రటరీ పరిధిలో ఉంచాం. సంక్షేమ హాస్టల్లో ఏ సమస్య ఉన్న తక్షణ పరిష్కారం కోసం నిధులు మంజూరు చేశాం. సీఎం సహాయ నిధి నుంచి సంక్షేమ హాస్టల్ పిల్లలకు నిదులు అందించాం . 119 నియోజకర్గాల్లో సుమారు రూ. 200 కోట్ల బడ్జెట్ తోని యంగ్ ఇంటి గ్రేటేడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. గత 10 ఏళ్లు పరిపాలించిన వారు సంక్షేమ హాస్టల్స్ పిల్లల డైట్ కోసం ఆలోచన చేయలేదు మా సీఎం, డిప్యూటీ సీఎం చొరవతో డైట్ ఛార్జీలు పెంచాం మా అధికారులందరూ సంక్షేమ పాఠశాలలు, హాస్టల్స్ విద్యార్థులకు ఏ సమస్య ఉన్న తక్షణం పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తున్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి అర్హత ఉన్న వారికే ఇస్తాం .... అనర్హులకు ఇవ్వం. ఈ నిధుల విడుదలకు కృషి చేసిన మా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క కు ధన్యవాదాలు ఈ పత్రికా సమావేశంలో వెల్ఫేర్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి గోష్, ఎస్ సి డి డి చీఫ్ సెక్రటరీ బుద్ధ ప్రకాష్, కమిషనర్ క్షితిజ, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అదనపు డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ నియోజకవర్గంలో మొంథా తుఫాన్ కు దెబ్బతిన్న పంటలు, రోడ్లు, కల్వర్టులు

- వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ సుడిగాలి పర్యటన..
- భారీ వరదల్లో గల్లంతు అయిన జంట గాలింపుకు రెస్క్యూ ఆపరేషన్ వేగవంతం..
- నేడు హుస్నాబాద్ మీదుగా ముఖ్యమంత్రి ఏరియాలో సర్వే
- వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది జాతీయ విపత్తు గా ప్రకటించి రాష్ట్రానికి కేంద్రం సహకరించాలి - మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ వెలుతురు అక్టోబర్ 30:** మొంథా తుఫాన్ హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రళయం సృష్టించింది.. వేలాది ఎకరాల్లో పంట నష్టం చేసింది.భారీ వరదకు మార్కెట్ లలో ధాన్యం కొట్టుకుపోయింది. కిలోమీటర్ల మేర రోడ్డు ధ్వంసం అయింది. కల్వర్టులు పూర్తిగా





కూలిపోయాయి. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రైతు కంట కన్నీరు కనిపిస్తుంది. ప్రతి చెరువు భీకరంగా అలుగులు పొంగుతున్నాయి. ఇక గ్రామానికి మరో గ్రామానికి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ హుటాహుటిన నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. అక్కన్నపేట మండలం మోత్కులపల్లె వాగు దాటుతుండగా బైక్ పై వెళున్న ఇద్దరు భార్యాభర్తలు ప్రణయ్, కల్పన లు గల్లంతైన ప్రాంతాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు.గల్లంతు అయి 24 గంటలు దాటిన ఇంత వరకు దొరకకపోవడంతో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరం చేసేలా చీఫ్ సెక్రెటరీ రామకృష్ణ తో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ , పోలీస్ కమిషనర్ నిరంతరం అక్కడే ఉండి సెర్చ్ ఆపరేషన్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఫైర్ ఫైటర్స్ ,గజ ఈతగాళ్ల తో గాలించిన ప్రయోజనం లేకపోవడంతో ఈరాత్రి ఎస్డిఆరెఫ్ బృందాలు ఘటన స్థలానికి చేరుకున్నాయనీ పేర్కొన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో రేపు ఉదయం నుండి సెర్చ్ ఆపరేషన్ ముమ్మరం చేసి గల్లంతు అయిన ఆచూకీ వేదికెల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు .గల్లంతు అయిన ప్రణయ్, కల్పనల కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతుండటంతో మంత్రి పొన్నం ప్రభాకర్ వారిని ఓదార్చారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.రైతులకు బాధితులకు తానున్నంటూ దైర్యం కల్పించారు. బస్వాపూర్ పోరెడ్డిపల్లి లో వరద ఉధృతికి తెగిన రోడ్డు పరిశీలించారు. గత ఆరు దశాబ్దాలుగా ఇంతలా బీభత్సమైన వరద చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్వాపూర్ అక్కెనపల్లి మధ్య మోయ తుమ్మెద వాగును పరిశీలించారు. తెగిన రోడ్లను ,కూలిన బ్రిడ్జి లు , కల్వర్టులను పునః నిర్మిస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం భారీ వరదకు కొట్టుకుపోవడంతో ప్రభుత్వం వారిని ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మహిళా రైతు వీరవ్వ కు చెందిన ధాన్యం పూర్తిగా వరదల్లో తుడుచుకుపెట్టుకుపోవడంతో కన్నీటి పర్యంతము అయ్యారు. మహిళా రైతు వీరవ్వ కు తక్షణ సహాయం కింద 10 వేల రూపాయలు అందించారు.ఇంకా మార్కెట్ లో ఉన్న తడిసిన ధాన్యాన్ని రైతులకు ఇబ్బందులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలంలో సీతారాంపూర్ చౌరస్తా వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిన ప్రాంతాన్ని పరిశీలించారు.

ఇందుర్తి లో లెవెల్ బ్రిడ్జి మునిగిపోవడంతో త్వరలోనే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. సైదాపూర్ మండల కేంద్రంలో ధాన్యం పూర్తిగా తడిసిపోయింది దానిని కొనుగోలు చేయాలని ఆదేశించారు. భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి కల్వర్టు వద్ద అప్పని నాగేంద్రం వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. లో వారి నివాసానికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు.గట్ల నర్సింగాపూర్ వద్ద తెగిన కల్వర్టు ను పరిశీలించారు. రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ లేని విపత్తు తుఫాన్ ప్రభావం వల్ల వచ్చిందని హుస్నాబాద్ లో జరిగిన నష్టం ఊహించని విధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో విడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడి హుస్నాబాద్ విపత్తు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నేడు హుస్నాబాద్, హనుమకొండ , వరంగల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే చేయనున్నారు. మరోవైపు దీనిని జాతీయ విపత్తుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా ఈ విపత్తు ను ఎదుర్కొని రైతులకు ప్రజలకు అండగా ఉందామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన

- బగ్రెస్ అభ్యర్థి యాదవ్‌పై ఇసికి ఫిర్యాదు

**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు)** :ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. వారం రోజుల్లో బీఆర్ఎస్ కేడర్‌ను లేకుండా చేస్తానన్న నవీన్ యాదవ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ నేతలు ప్లలె రవికుమార్, క.కిషోర్ గౌడ్, రామచంద్రు నాయక్, ఉపేంద్ర చారి ఉన్నారు. ఇటీవల బీఆర్ఎస్ క్యాడర్‌ను ఉద్దేశించి ’గల్లీ దాటరు.. ఇంటిని చూడరు’ అంటూ బెదిరించిన ఆయన తాజాగా గులాబీ క్యాడర్‌నే లేకుండా చేస్తానని బెదిరించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. తాజాగా ఓ యూట్యూబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సదరు యాంకర్ ’బీఆర్ఎస్ క్యాడర్‌ను లేకుండా చేస్తా అంటున్నారు.. నిజంగా లేకుండా చేస్తారా?’ అని ప్రశ్నించగా ’ఏసేస్తా’? వారం రోజుల్లో బీఆర్ఎస్ క్యాడర్ లేకుండా చేస్తా’ అంటూ మరోసారి ధమ్కీ ఇచ్చారు. దీనిపైనా సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో స్పందించారు. రౌడీబిడ్డకు టికెట్ ఇస్తే ఇలాంటి బెదిరింపులకే పాల్పడతారు, జూబ్లీహిల్స్ ఓటర్లూ బహుపరాక్ అని పలువురు సూచించారు. అయితే నవీన్‌యాదవ్ ఎన్ని ధమ్కీలు ఇచ్చినా బీఆర్ఎస్ క్యాడర్‌ను ముట్టుకోవడం కూడా సాధ్యం కాదని బీఆర్ఎస్ నేతలు బదులిస్తున్నారు.



# ఓయూ డిగ్రీ పరీక్షల తేదీల ఖరారు

**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు):** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్‌డబ్ల్యూ, బీఎస్సీ, బీబీఏ, బీబీఏ అనాలిటిక్స్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీఏ రిటైల్ మేనేజ్‌మెంట్ తదితర కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ లిలిలి.నీబపజీనితి జీ.జీఇ.తినిలో చూసుకోవచ్చని సూచించారు.



# సంపాదకీయం..

# సహాయ,పునరావాసం తక్షణ కర్తవ్యం కావాలి !

మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. వాగులు, వంకలు చెరువులు ఏరులయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు మునిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మక్కజోన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం వచ్చినా వరదలు వచ్చినా, తుఫాన్లు వచ్చినా తొలుత నష్టపోయేది మాత్రం రైతన్నలే. ఇరు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీగా నష్టపోయారు. పంటలు నీటమునిగాయి. వరిచేలు నీట మునిగింది. కొన్నిచోట్ల ఆరపోసిన ధాన్యం కొట్టుకు పోయింది. కోతదశకు వచ్చిన పంట నేలకొరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేల ఎకరాల వరకూ వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. నేలకు ఒరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టాలని అధికారులు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట నేలవాలడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అరటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ప్రభుత్వాలు తొలుత ఆదుకోవాల్సింది రైతన్నలనే. నివేదికలతో ఆలస్యం చేయకుండా రైతులను తొలుత ఆదుకోవాలి. నీరు చేరడంతో నానిన పంటలను కొనుగోలు చేయాలి. మునిగిన పంటలకు వెంటనే పరిహారం చెల్లిచాలి. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి. అతిభారీ వర్షాలతో వాగులు,వంకలు ఉగ్రరూపం తో ప్రవహిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో, పాతాళగంగ దారిలో కొండచరియలు విరిగిపడ్డాయి. నల్లమలలోనూ చెరువులు, కుంటలు నీటితో





నిండిపోయాయి. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. వందల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో తీరం దాటిన మొంథా తీవ్ర తుపాను.. అతిభారీ వర్షాలు, బలమైన గాలులతో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్ని ముంచేసింది. ఇటు తెలంగానలో ఖమ్మం, వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్ జిల్లాలను ముంచెత్తింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ భారీవర్షాలతో వాగులు పొంగి ప్రవహించడంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. సముద్రం 20-30 మీటర్లు ముందు కొచ్చింది. వందల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలవాలడంతో సరఫరా స్తంభించింది. ప్రభుత్వ చర్యలతో చాలాచోట్ల పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. తీరప్రాంత మండలాల్లో గాలుల దెబ్బకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోల్‌కతా-చెన్నై జాతీయరహదారిపై రాకపోకలు నిలిచాయి. ముందే ముప్పును గుర్తించి చాలామందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నంద్యాల పట్టణం మధ్యలో ప్రవహించే కుందూనది, మద్దిలేరు, చామకాలువ కూడా ఉప్పొంగడంతో పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. శ్రీశైలం-హైదరాబాద్ మార్గంలో సున్నిపెంట దాటిన తర్వాత కొండ చరియలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. భారీ వృక్షాలు నేలకూలి రహదారులకు అడ్డంగా పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాలకు జలాశయంలో పెద్దఎత్తున నీరు చేరడంతో విజయనగరం జిల్లా పరిధిలోని తాటిపూడి రిజర్వాయరు గేట్లు ఎత్తేశారు. ఆ నీటి ఉధృతికి విశాఖ జిల్లా భీమిలి మండలంలోని గోస్తనీ నది పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గత వారం రోజుల పాటు ప్రజలను గజగజలాడించిన మొంథా తుఫాను ప్రభావం ఉపశమించడంతో, ప్రమాదం నుండి బయట పడ్డామని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసాయి. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వరదలతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. వరద నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. భారీ వర్షాలతో వరంగల్‌లో రహదారులు నీట మునిగాయి. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తీగల బంజర వద్ద పగిడేరు వాగు ఉధృతంగా పారడంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వాలు పునరుద్దరణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయాలు పక్కన పెట్టి క్షేత్రస్తాయిలో నష్టం అంచనాలు వేసి సహాయ, పునరావాస కార్యక్రమాలు ముమ్మరం చేయాలి. రోడ్లను మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్దరించాలి. పంటల నష్టాలను అంచనా వేసి రైతులకు ముందుగా తాత్కాలిక ఉపశమనం కలిగించాలి. ఇళ్లు వాకిళ్లు కొట్టుకుపోయిన వారిని గుర్తించి వారికి నిత్యావసరాలతో పాటు జీవనోపాధి కింది పరిహారం అందించాలి. యుద్ధప్రాతిపదికన ఇవి చేపడితే తప్ప ప్రజలు కోలుకోలేరు. ప్రభుత్వాలు వెంటనే ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేంద్రం కూడా నివేదికల కోసం ఎదురు చూడకుండా ముందుగా తక్షణ సాయంగా కొంత డబ్బును రాష్ట్రాలకు అందించాలి. అవసరమైతే గ్రామాల వారిగా బాధజతులను గుర్తించి అక్కడిక్కడే పరిహారం చెల్లింపులు చేయాలి. గతంలో లాగా నెలల తరబడి వేచిచూసే ధోరణికి స్వస్తి పలకాలి.

## వరదప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కందుల పర్యటన

**- నష్టం వివరాలు తెలుసుకున్న మంత్రి**



**భీమవరం,అక్టోబర్30( వెలుతురు):**
రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పలుమార్లు పర్యటనలు చేసి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం తరఫునుండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు సైతం అధికారులతో సమన్వయం చేసుకొని, తుఫాను ప్రభావాన్ని ఎదుర్కోవాలని పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశర చేశారు. ప్రాథమిక అంచనాలో సుమారు 98 హెక్టార్ల అరటి తోటలు, 1800 హెక్టార్ల వరి పంట నేలకొరిగినట్లుఉద్యాన అధికారులు తెలిపారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. ఉండ్రాజవరం, దమ్మెన్ను, పసలపూడి, కే సావరం, మోర్త, కాల్దారి తదితర గ్రామాలలో నివాసయోగ్యం కాని గృహాలలో నివసిస్తున్న 50 కుటుంబాలు, 170 మందికి, పునరావాసం కల్పించామన్నారు. వారికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్యవాడ, తదితర గ్రామాలలో మూడు రోజులపాటు మాంసం విక్రయాలు నిలిపి వేయాలని గ్రామంలో అవగాహన కల్పించినట్లు కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. తుఫాను ప్రభావాన్ని తట్టుకొని,ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా, మండల విద్యుత్ శాఖ, కరెంటు తీగలపై చెట్టుకొమ్మలు పడకుండా నరికివేత, విద్యుత్ స్తంభాల మార్పిడి వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఎలక్ట్రికల్ అధికారులు చెప్పారు. అప్పటివరకు వస్తూ, పోతూ ఉన్న విద్యుత్ సరఫరా భారీ గాలులతో సరఫరా నిలిచిపోయింది. ప్రజలకు నెట్ సంబంధం తెగిపోయింది, ఇన్వెర్టర్లు మూగబోయాయి, అంధకారంలో, దోమల తో ప్రజలు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఏది ఏమైనా మండలంలో తుఫాను ప్రభావం విద్యుత్ సరఫరా పై అధికంగా పడిందని చెప్పుకోవాలి. కార్తీకమాసంలో నిర్వహించుకునే పిక్ నిక్ లు, వన సమారాధనలు తుఫాను ప్రభావంతో ఆ ఊసు లేకుండా పోయింది. సెలవులు రద్దుచేసి, పాఠశాలలో యధావిధిగా గురువారం కొనసాగాయి. అధికారులు, కూటమి పార్టీల నాయకులు నిర్వహించిన సేవా కార్యక్రమాలు అభినందనీయమని, ముఖ్యంగా ఉండ్రాజవరం మండలంలో అధికారులు, నాయకులు చేపట్టిన ముందస్తు చర్యలు తనకు సంతృప్తినిచ్చాయన్నారు.

## మరో 2వేలు తగ్గిన పసిడి ధరలు



**హైదరాబాద్, అక్టోబర్30(వెలుతురు):**
బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీపావళి సమయంలో రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర, ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాల వల్ల పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గుతున్నాయి. గత రెండు వారాల్లో పసిడి భారీగా తగ్గింది. ఈ క్రమంలో బంగారం ధర గురువారం కూడా భారీగా పడిపోయింది. దాదాపు రూ.2 వేలు తగ్గింది. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా బంగారం ధరలు పతనమవుతున్నాయి. భారత్‌లో నిన్న 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం రూ.1,22,400 ఉంది. ఇవాళ రూ.1,910 మేర తగ్గి రూ.1,20,490 చేరింది. దీంతో పసిడి ప్రియులు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.

## స్త్రీ ఆరోగ్య సంరక్షణ - సామాజిక న్యాయానికి పునాది



**మన్నారం నాగరాజు .**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

ఇంటిల్లిపాది అవసరాలను గమనిస్తూ, కుటుంబం నడవాలంటే ఏం అవసరమో అర్థం చేసుకుని, అందరికీ సుఖసంతోషాలు కలిగేలా సతత కృషి చేసే వ్యక్తి భారతీయ స్త్రీ. ఆమె తల్లి, భార్య, చెల్లి, కుమార్తె వంటి అనేక పాత్రలను సమతుల్యంగా నిర్వర్తిస్తూ కుటుంబానికి జీవనరేఖగా నిలుస్తుంది. కానీ కుటుంబ సభ్యులందరి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపే ఆమె, తన ఆరోగ్యాన్ని మాత్రం వెనుకబెడుతుంది. పితృస్వామ్య భావజాలం ఇంకా సమాజాన్ని బిగించి ఉంచడం వల్ల స్త్రీ ఆరోగ్యంపై నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ఒంట్లో నలత ఉన్నా బయటపెట్టకుండా, రోజంతా పనుల్లో తలమునకలై కుటుంబాన్ని నడిపిస్తూ నిశ్శబ్దంగా బాధపడే మహిళల సంఖ్య మన దేశంలో ఎంతో ఎక్కువ.

ఈ వాస్తవాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ "స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్" అనే మహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా పది లక్షలకుపైగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కోట్లాది మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, మందులు, సలహాలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. గాంధీజీ జయంతి వరకు కొనసాగనున్న ఈ అభియాన్ మహిళల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా లింగవివక్షను తగ్గించే దిశగా కూడా ముందడుగు వేస్తోంది.

స్త్రీ ఆరోగ్య పరిస్థితి మన దేశంలో ఇంకా ఆందోళనకరంగానే ఉంది. జీవనశైలిలో మార్పులు, పర్యావరణ కాలుష్యం, ఆహార అలవాట్లలో వచ్చిన తేడాలు అన్నీ కలసి మహిళల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఐదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 15 నుంచి 49 సంవత్సరాల మధ్య వయసున్న మహిళల్లో 57 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ శాతం మరింత ఎక్కువ. తల్లికి రక్తహీనత ఉంటే గర్భంలోని శిశువుకి గుండెజబ్బులు, జన్యు లోపాల ముప్పు అధికమవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం సరైన పౌష్టికాహారం లోపం, అధిక శ్రమ, విశ్రాంతి కొరత. అంతేకాదు హైబీపీ, మధుమేహం, థైరాయిడ్ వంటి సమస్యలు కూడా మహిళల్లో వేగంగా పెరుగుతున్నాయి. గుండె జబ్బుల ముప్పు మూడింతలు పెరిగిందని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. పురుషులతో పోలిస్తే మహిళల్లో గుండెపోటు లక్షణాలు భిన్నంగా ఉండటంతో నిర్ధారణలో ఆలస్యం అవుతోంది.

సరైన పౌష్టికాహారం అందకపోవడం వల్ల ఎముకలు పెళుసుబారడం, విటమిన్-డి లోపం, పీసీవోఎస్ వంటి సమస్యలు విపరీతంగా పెరిగాయి. యువతుల్లో హార్మోన్ల అసమతుల్యత, మాసిక ధర్మం లోపాలు, ఒత్తిడి సంబంధిత సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. ఇది కేవలం జీవనశైలి సమస్య కాదని, ఆరోగ్య అవగాహన లోపమే ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశా కార్యకర్తలు, స్థానిక వైద్యులు కలిసి స్త్రీలలో ఆరోగ్య చైతన్యం పెంచడానికి ప్రయత్నాలు చేయాలి. ప్రతి పంచాయతీ స్థాయిలో నెలకోసారి మహిళల ఆరోగ్య దినోత్సవం నిర్వహిస్తే, అనేక సమస్యలు ముందుగానే గుర్తించి నివారించవచ్చు.

శారీరక సమస్యలతో పాటు మానసిక ఆరోగ్య సమస్యలు కూడా ఇప్పుడు మహిళల జీవితంలో కీలక సవాలుగా మారాయి. కుటుంబ సమస్యలు, ఆర్థిక భారాలు, గృహపనుల ఒత్తిడి, సామాజిక అంచనాలు - ఇవన్నీ కలసి మహిళలను మానసికంగా కుంగదీస్తున్నాయి. చాలామంది మహిళలు ఈ బాధను బయటపెట్టక లోపలే మింగేస్తారు. ఫలితంగా ఆందోళన, కుంగుబాటు, నిద్రలేమి, నిస్సత్తువ వంటి సమస్యలు విస్తరిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడేవారిలో మహిళల శాతం 60కి పైగా ఉంది. భారతదేశంలో ఈ పరిస్థితి మరింత తీవ్రమైనది. మానసిక ఆరోగ్యం అనేది శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యం అనే అవగాహన సమాజంలో పెంచాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కౌన్సెలింగ్ సేవలు, హెల్ప్‌లైన్ సదుపాయాలు, సామాజిక మద్దతు కేంద్రాలు ఏర్పాటు చేయడం అత్యవసరం. మహిళల్లో క్యాన్సర్ ముప్పు కూడా పెరుగుతున్న మరో ఆందోళనకర అంశం. రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వంటి వ్యాధులు గతంలో వృద్ధ మహిళల్లో ఎక్కువగా కనిపించేవి. ఇప్పుడు యువతుల్లోనూ ఈ వ్యాధులు విపరీతంగా వ్యాపిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 2019లో బ్రెస్ట్ క్యాన్సర్ కారణంగా భారత్‌లో 74 వేల మంది మహిళలు ప్రాణాలు కోల్పోగా, 2023 నాటికి ఆ సంఖ్య 82 వేలకి పెరిగింది. కానీ 30 నుండి 49 ఏళ్ల మధ్య వయసు మహిళల్లో పరీక్షలు చేయించుకున్నవారు కేవలం 0.9 శాతం మాత్రమే. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ పరీక్షలు కూడా 2.2 శాతం మించలేదు. ఇది మహిళల్లో అవగాహన లోపం, మౌలిక వైద్య వసతుల కొరత, మరియు సామాజిక నిర్లక్ష్యానికి నిదర్శనం.

క్యాన్సర్ నియంత్రణకు ప్రభుత్వం ఆసుపత్రుల్లో తగిన పరికరాలు, వైద్య సిబ్బంది, స్క్రీనింగ్ సదుపాయాలు కల్పించాలి. మొబైల్ హెల్త్ యూనిట్ల ద్వారా గ్రామగ్రామాన పరీక్షలు నిర్వహించడం అవసరం. మహిళల్లో ప్రసవపూర్వ, ప్రసవానంతర ఆరోగ్య పరీక్షలను తప్పనిసరి చేయాలి. ఆరోగ్య శిబిరాల్లో మానసిక ఆరోగ్యంపై, పోషకాహారం, వ్యాయామం, మరియు వ్యక్తిగత పరిశుభ్రతపై శిక్షణ ఇవ్వడం అత్యవసరం.

మహిళల ఆరోగ్యం అంటే కేవలం వ్యాధులు లేకపోవడమే కాదు - శారీరక, మానసిక, సామాజిక సమతుల్యత కలిగి ఉండటం. దీనికి సరైన పౌష్టికాహారం, విశ్రాంతి, సానుకూల వాతావరణం అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార సరఫరా బలోపేతం చేయాలి. "పోషణ అభియాన్", "ప్రధాన్ మంత్రి మాతృ వందనా యోజన", "జనని సురక్షా యోజన" వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా మహిళల ఆరోగ్య భద్రతను కుటుంబ స్థాయిలో బలపరచాలి. ఈ పథకాలు వాస్తవ ఫలితాలను ఇవ్వాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో ముందుకు రావాలి.

ప్రస్తుతం కాలుష్యం, రసాయన ఆహారాలు, ప్లాస్టిక్ ప్రభావం వంటి పర్యావరణ అంశాలు స్త్రీల ఆరోగ్యాన్ని బలహీనపరుస్తున్నాయి. సహజ ఆహారాన్ని ప్రోత్సహించడం, యోగా, ధ్యానం, నడక వంటి శారీరక కదలికలను రోజువారీ జీవనంలో భాగం చేయడం తప్పనిసరి. ఇది కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికి కాదు, కుటుంబ ఆరోగ్య భద్రతకూ పునాది. శరీరానికీ, మనసుకీ సమాన ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా స్త్రీ తనలోని శక్తిని నిలబెట్టుకోగలదు.

ప్రతీ కుటుంబంలో మహిళ ఆరోగ్యాన్ని చూసుకోవడం ఒక కర్తవ్యం కావాలి. రోజంతా కష్టపడే స్త్రీకి కొంత విశ్రాంతి, మానసిక ప్రశాంతత కల్పించడంలో కుటుంబ సభ్యులందరూ భాగస్వామ్యం కావాలి. ఇంటి వెలుగైన స్త్రీ కొవ్వొత్తిలా కరిగిపోకూడదు - ఆమె వెలుగే దేశ బలం. కుటుంబం, సమాజం, ప్రభుత్వం కలిసి స్త్రీ ఆరోగ్యాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలి. స్త్రీ ఆరోగ్యం కేవలం వ్యక్తిగత విషయం కాదు - అది సామాజిక న్యాయం, లింగ సమానత్వానికి పునాది.

ఆరోగ్యవంతమైన మహిళే సశక్త కుటుంబానికి, బలమైన దేశానికి కారణం. అందుకే స్త్రీ ఆరోగ్యం కోసం కృషి చేయడం అంటే దేశ భవిష్యత్తు కోసం కృషి చేయడమే. కేంద్రం చేపట్టిన "స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్" ఈ దిశగా ఆశాజ్యోతి. రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, వైద్యులు, మహిళా సంఘాలు కలిసి దీనిని జాతీయ ఉద్యమంగా మార్చాలి. పల్లెల్లో నుంచి పట్టణాల వరకు ప్రతి మహిళకు "ఆరోగ్య హక్కు" అందేలా ప్రయత్నాలు జరగాలి. స్త్రీల ఆరోగ్య సంరక్షణ అనేది వైద్య అంశం కంటే ఎక్కువ - అది సమాజంలో సమానత్వం, గౌరవం, మరియు న్యాయం స్థాపనకు బలమైన ఆధారం. ఆరోగ్యవంతమైన మహిళే సశక్త భారతానికి మూలస్తంభం. కాబట్టి మనమందరం ఈ నినాదాన్ని గుండెల్లో దిద్దుకోవాలి అవసరం ఎంతైనా ఉన్నది.

***"స్వస్థ నారీ అంటే సశక్త భారత్!"***

## తెనాలిలో బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



**గుంటూరు,అక్టోబర్30( వెలుతురు):**
మొంథా తుఫాన్ ప్రభావంతో తెనాలి పట్టణంలో అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న పేదలకు గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు కాలనీలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న మంత్రి మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో 4,553 పునరావాస కేంద్రాలలో 9,451 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. పట్టణంలో 8 పునరావాస కేంద్రాలలో ఉన్న 615 మందికి 25 కేజీల చొప్పున బియ్యం, కూరగాయలు, సరుకులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనా సింహ, తహసిల్దార్ కెవి గోపాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక, కమిషనర్ బి రామ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నవంబర్ 10న కామారెడ్డిలో బహిరంగ సభ

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:**
42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఈరోజు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఐఏఎస్ బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి చిరంజీవులు,బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ విశ్వదాన్ మహారాజ్ , జస్ట్ ఈశ్వరయ్య , బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్ హాజరై మాట్లాడారు.. 24న జరిగిన బీసీల మహాధర్నాలు పెద్ద ఎత్తున బీసీలు పాల్గొని జయప్రదం చేసిన తర్వాత 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకై,9వ షెడ్యూల్లో చేర్చేంతవరకు 42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నిష్క్రమించదని నాయకులు ప్రకటించారు, ఈ సందర్భంగా టి.చిరంజీవులు మాట్లాడుతూ 9వ షెడ్యూల్లో చేర్చడమే ఏకైక మార్గమని అదే శ్రీరామరక్షాన్ని 42 శాతం రిజర్వేషన్లు కు అప్పుడే రాజ్యాంగ రక్షణ ఉంటుందని తెలిపారు జస్ట్ ఈశ్వరయ్య మాట్లాడుతూనే సాధ్యమని తెలిపారు బాలరాజు గాడు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్రవ్యాప్త ఉద్యమ ప్రణాళికను ప్రకటిస్తుందని తెలిపారు డా.,విషాదన్ మహారాజ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో నీళు ్ళ,నిధులు నియామకం కోసం అన్ని రాజకీయ పార్టీలు ఏకమై పోరాటం చేసేయని కానీ రెండున్నర కోట్ల మంది బీసీలు 42% కోసం నైన్త్ షెడ్యూల్ కోసం ఉద్యమిస్తుంటే ఈ రాజకీయ పార్టీలు చలనం లేదని విమర్శించారు బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేసి అనంతపుర అఘోర కేసీఆర్ కు రేవంత్ రెడ్డికి బిజెపికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు అన్ని పార్టీలు ప్రజాక్షేత్రములు ముద్దాయిని చేసి 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటాం అని అన్నారు రాజ్యాధికార దిశగా పయనిస్తామని బీసీలకు పిలుపునిచ్చారు ఎస్సీ ఎస్టీలు బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయని ప్రకటించారు నవంబర్ 3న అన్ని మండల కేంద్రాల్లో ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వోలకు వినతి పత్రాలు ఇస్తామని, 4 న కలెక్టర్ లకు వినతి పత్రాలు ఇస్తామని, 6న సీఎస్ ప్రధాన కార్యదర్శి కీ వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. 7న రాష్ట్ర స్థాయి విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసామని తెలిపారు. 10న కామరెడ్డీ జిల్లా కేంద్రలో బారి సభ తో భవిష్యత్ కార్యాచరణ పోరాట ప్రణాళికను ప్రకటిస్తామని తెలిపారు. బీసీ ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన చిరంజీవులు ఐఏఎస్ రిటైర్డ్. అక్టోబర్ 30 గురువారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో 42% బీసీ రిజర్వేషన్ల సాధన సమితి అధ్యక్షులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి చిరంజీవులు 42% బీసీ రిజర్వేషన్లు సాధించేందుకు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. నవంబర్ 3వ తేదీన మండల స్థాయి అధికారులకు, 4న జిల్లా కలెక్టర్లకు, అరుణ తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కి 42 శాతం రిజర్వేషన్లను తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని విజ్ఞాపన పత్రాలను సమర్పించడంతో పాటు పదో తేదీన కామారెడ్డిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ సాంప్రదాయ బీసీ సంఘాలు 350 లో పడ్డాయని విమర్శించారు. రాజకీయ పార్టీలకు కొమ్ముకాసే విధంగా తమ ఉద్యమ కార్యాచరణను మార్చుకుంటున్నాయని దుయ్యబట్టారు. వారికి రాజ్యాంగం పైన చట్టాల పైన తీర్పుల పైన సమగ్రమైన అవగాహన లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు 42% బి సి రిజర్వేషన్లపై కపట వైఖరితో ఉన్నాయని, బీసీల రిజర్వేషన్ల సమస్య తెలంగాణ రాష్ట్ర సమస్య కాదా అని రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. 42% బి సి రిజర్వేషన్ల సాధన సమితి చేస్తున్న పోరాటం నికార్సైన పోరాటమని కాబట్టి రాజకీయ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీలకు చట్టబద్ధంగా అన్ని హక్కులు అధికారం దక్కుతున్నాయని ఇప్పుడు బీసీల కోసం బీసీలతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ దుర్గయ్య గౌడ్,జాతీయ నాయకులు ఆల్మెన్ రాజ్ ,బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యులు కే వీ గౌడ్, బైరు శేఖర్ ,రాఘవేంద్ర ముదిరాజ్, డా, విజయ్ భాస్కర్ ,చెన్న శ్రీకాంత్ లింగేష్ యాదవ్ అవ్వారు వేణు, తదితరులు పాల్గొన్నారు.



## ఫీజు బకాయిలన్నింటినీ విడుదల చేసి ఆ తర్వాత కాలేజీల మీద తనిఖీలు చేయండి

**- ఫీజు రీయంబర్స్మెంట్ నిధులు ఇవ్వడం చేతకాక కాలేజీలపై విజిలెన్స్ దాడులు అనడం సిగ్గుచేటు.**

**- బీసీ నేత లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:**
పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ నిధులు విడుదల చేయడం చేతగాక రాష్ట్ర ప్రభుత్వం కాలేజీల మీద విజిలెన్స్ దాడులు చేస్తామనడం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. నిజంగా బడుగు బలహీన వర్గాల విద్యార్థుల చదువుకోవాలనే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటే వెంటనే ఫీజులన్నింటినీ విడుదల చేసి అప్పుడు కాలేజీల మీద తనిఖీలు చేయండి అంతేగాని ఫీజు రీయంబర్స్మెంట్ ఇవ్వనందుకు నవంబర్ 3 నుంచి ఉన్నత విద్యాసంస్థలు బంద్ కు ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం వాళ్లని బెదిరిస్తానికి ఈ విధంగా చేయడం సరికాదన్నారు. కాలేజీలో గత రెండు సంవత్సరాలుగా లేని లోపాలు ఇప్పుడే మీకు కనిపించాయా అని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని లింగమ్ గౌడ్ ప్రశ్నించారు.

## బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తాం

**- నవంబర్ 2న బీసీ జేఏసీ విస్తృతస్థాయి సమావేశం.**

**- జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేసి బీసీలకు రిజర్వేషన్లు సాధించుకుంటామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. హైదరాబాదులో బీసీ జేఏసీ గోడపత్రికలను ఆవిష్కరించిన అనంతరం లింగంగౌడ్ మాట్లాడుతూ బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించడానికి వచ్చే నెల రెండున బీసీ జేఏసీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బంజారా హిల్స్ లోని కళింగ భవన్ హాల్ లో సమావేశం జరుగుతుందన్నారు బీసీ జేఏసీ విస్తరణ రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల స్థాయి కమిటీల నిర్మాణ ప్రతిపాదనలు అందరితో చర్చించి కమిటిలను ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వీరబోయిన లింగయ్య యాదవ్ బీసీ విద్యార్థి సంఘం ఉస్మానియా యూనివర్సిటీ ఇన్చార్జి గోదా రవీందర్ అంజి తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్ డివిజన్లో కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ పర్యటన



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:**
హిమాయత్ నగర్ డివిజన్ లోని పార్థ గేట్ లో డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులు అక్కడున్న వీధి దీపాలు, రోడ్డు డ్రైనేజ్ సమస్య లను కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. దీనికి సంబంధించి స్థానిక కార్పొరేటర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో అఫ్సర్ బై, సమీర్ కురిబి, హసన్, కాద్రి, అల సౌద్, జాకీ, నదీం, జాహీద్, అహ్మద్ మహేష్, జైస్వాల్, శేఖర్, అభిషేక్, హితేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆరుట్ల గ్రామంలో భారీ వర్షానికి దెబ్బతిని కూలిపోయిన ఇండ్లను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తాం అండగా ఉంటాం**

**- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి**



**మంచాల వెలుతురు అక్టోబర్ 30:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో గతకొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిని కూలిపోయిన గట్ల గణేష్, నూకం రమేష్, చిందం యాదయ్య బొద్రమోని మల్లేష్, నూకం బన్నీ ఇండ్లను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు పరిశీలించారు ఈకార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మంచాల మండలంలోని పలుగ్రామాల్లో భారీవర్షానికి దెబ్బతిని ఇండ్లు కూలిపోయిన బాధితులను ఆదుకొని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తాం బాధితులకు అండగా ఉంటాం అన్నారు ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ కంబాలపల్లి బుగ్గ రాములు మార లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మార సురేష్ ఎన్నిదుల సురేష్ మానిపాటి వెంకటేష్ నూకం మల్లేష్ నూకం బాలరాజు భాస్కర్ రైనా ఎండి అశ్రఫ్, ఇంద్రోజు ఆంజనే యులు నూకం సత్యనారాయణ నూకం లక్ష్మయ్య ఆడెపు మధు నూకం భాస్కర్ నూకం శంకర్ నూకం రమేష్ ఆడెపు బాలయ్య ఆవ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రజా పాలన తోనే ప్రజల జీవితాల్లో మార్పు...

**విద్యావంతుడు, సేవ కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన వ్యక్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్**


**- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.**



**కూకట్ పల్లి అక్టోబర్ 30 వెలుతురు:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ఎర్రగడ్డ డివిజన్ లోని ఆనంద్ నగర్, బంజారా నగర్, ప్రేమ్ నగర్, ఓల్డ్ సుల్తాన్ నగర్, జామియా మసీద్, నూర్ మసీద్, న్యూస్ సుల్తాన్ నగర్, నేతాజీ నగర్, రాజీవ్ నగర్ పార్క్ కాలనీలలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు డా. ఆర్ భూపతి రెడ్డి, తూడి మేఘా రెడ్డి, జి. మధుసూదన్ రెడ్డి, డా. రాజేష్ రెడ్డి, గణేష్, ఎమ్మెల్సీ దండే విఠల్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, ఇన్ ఛార్జ్ చైర్మన్ ఇనగాల వెంకట్ రామ్ రెడ్డి, తెలంగాణ విజయ డెయిరీ డెవలప్మెంట్ చైర్మన్, గుత్తా అమిత్ రెడ్డి, తహర్ బిన్ హమ్దాన్ చైర్మన్ ఉర్దూ అకాడమీ నవీన్ యాదవ్ తో కలిసి సత్యం శ్రీరంగం బృందంతో గడప గడపకు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించగల నాయకుడు నవీన్ యాదవ్ మాత్రమేనని ఆయన యువ నాయకుడు, విద్యావంతుడు, సేవ కార్యక్రమాలతో ప్రజలకు చేరువైన వ్యక్తి అన్నారు. అందువల్ల ప్రతి ఓటరును కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో నరసింహా యాదవ్, మస్తాన్ రెడ్డి, సుంకన్న, శేఖర్ గజానంద్, రాము గౌడ్, అహమద్, హర్షద్ సోను, జెల్ల శివ, సతీష్ రెడ్డి, అరుణ్ గౌడ్, రాము, పల్లపు వేణు, జాకిర్ పాషా, సురేందర్, కృష్ణ మూర్తి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు పాల్గొని నినాదాలతో జోష్ నింపారు.

# జాతర ఉత్సవాలకు ముస్తాబు అవుతున్న మరో దక్షిణకాశి ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం

**నవంబర్ 5వ తేదీ కార్తీకపౌర్ణమి బుగ్గ రామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం**









**మంచాల వెలుతురు అక్టోబర్ 30:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామ పరిధిలోని మరో దక్షిణకాశి పుణ్యక్షేత్రంగా పేరు పొందిన బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు నవంబర్ నెల 5వ తేదీ కార్తీకపౌర్ణమి రోజు జాతర ఉత్సవాలు ప్రారంభమై 20వ తేదీ అమావాస్య వరకు జాతర ఉత్సవాలు జరుగుతాయి బుగ్గ రామలింగేశ్వర స్వామి దర్శించుకోవడానికి రాష్ట్రం నాలుమూలల నుండి వేలాది మంది భక్తులు వచ్చి స్థానాలు ఆచరించి నీటి గుండంలో ఉన్న బుగ్గ రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు కుటుంబ సభ్యులతో కలిసి సత్యనారాయణస్వామి వ్రతాలు చేస్తారు బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న ప్రత్యేకత తూర్పు నుండి పడమరాకు గంగా ప్రవహించి దక్షిణ దిక్కుగా మళ్లీ మళ్లీ తూర్పు దిక్కుకు గంగా ప్రవహిస్తుంది అందుకే బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి మరో దక్షిణకాశిగా పేరుపొందింది భక్తులు బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి చేరుకోవడానికి ఇబ్రహీంపట్నం నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ప్రైవేటు వాహనాలు ప్రతి 10 నిమిషాలకు ఒకసారి రాకపోకలు కొనసాగిస్తూ ఉంటాయి బుగ్గరామలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ అధికారులు దేవాలయ కమిటీ సభ్యులు అన్ని వసతులు కల్పిస్తారు

బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయం పురాణం చరిత్ర

ఈ ఆలయం బుగ్గ లో (ఉటప్రాంతం) వెలిసింది అదేవిధంగా బుగ్గ ప్రవాహమై ఎల్లవేళలా జీవ నదిలా ప్రవహిస్తూ అలనాటి పురాణ పురుషులనుమహా, పురుషులను ఆకట్టుకుంది ఆనేథ్యంలో తెలంగాణ ప్రాంతం రంగారెడ్డి జిల్లా, మంచాల మండలం ఆరుట్ల గ్రామ శివారులో ప్రక్రుతి సిద్ధంగా ఏర్పడిన ఈ పుణ్యతీర్థం కాలక్రమేనా శ్రీరాముని ద్రుష్టిని ఆకర్షించింది శివునికై తపస్సు చేసుకునే అనువైన ప్రశాంతమైన ప్రదేశంగా భావించి తపస్సుకై పూనుకున్నట్లు స్థానికుల ప్రగాఢ విశ్వాసం శ్రీరాముని తపోబలం వల్ల శివుడు ప్రత్యక్షమై శ్రీరామునికి ప్రత్యక్షమై ఈపుణ్య తీర్థం శ్రీబుగ్గ రామలింగేశ్వర ఆలయంగా వర్ధిల్లుతుందనీ, కలియుగాంతంలో శివుడు వేరుకాడు విష్ణువు వేరుకాదని భావించి భక్తులు తండోపతండాలుగా శివునికి, విష్ణువుకు ప్రీతికరమైన కార్తీక మాసంలో మన ఇరువురినీ పూజించి ఈ బుగ్గలోపుణ్య స్నానమాచరించి మన ఇరువురి దీవెనలు పొందితరిస్థారనీ శివుడు శ్రీరామునితో చెప్పి అద్రశ్యమైనట్లు స్థలపు రాణం చెబుతోంది మొదట్లో ఈక్షేత్రం అంతగా ప్రజాదరణ పొందలేదు గత 50 సంవత్సరాల నుండి కొంత మంది పురుషులు ఇక్కడకు రావడం, ఈప్రాంతం వారికి కూడా నచ్చడం కొంత కాలం ఇక్కడ తపస్సు పూజలు చేయడం ఈ పుణ్య క్షేత్రం గురించి చుట్టుపక్కల గల పంట పొలాల వారికి ఈపుణ్య క్షేత్రం గురించి చెప్పడం వల్ల ఆనోటా ఈనోటా క్రమేణా పలు గ్రామాల వారికి ఈ పుణ్యక్షేత్రం మహిమలు తెలియడం వల్ల ప్రతి కార్తీక పౌర్ణమి మొదలు కార్తీక అమావాస్య వరకు పుణ్యస్నానాలు ఆచరించి, పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించి తరిస్తున్నారూ ఈపుణ్యక్షేత్రానికి వేరే రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తండోపతండాలుగా రావడం పుణ్యస్నానాలు ఆచరించడం చూస్తూ ఉన్నాము 2024 నుంచి దేవాదాయశాఖ వారు కూడా ఈక్షేత్రాన్ని ఇంకా అభివృద్ధి చేయాలని పూనుకన్నట్లు వార్తలు వస్తున్నాయి ఏదిఏమైనా ఈ పుణ్యక్షేత్రం వల్ల ఆరుట్ల గ్రామం తెలంగాణాలోనే కాకుండా ఇతరరాష్ట్రాలుదేశాలలో కూడా తన ఉనికిని చాటుకోపోతుంది. ఇది ఆరుట్ల గ్రామ ప్రజలు చేసుకున్న పుణ్యం అని స్థానికులు దేవాలయశాఖ అధికారులు అంటున్నారు ఈ సందర్భంగా దేవాలయాన్ని పరిశీలించిన దేవాదాయశాఖ అధికారులు దేవాలయ కమిటీ సభ్యులు భక్తుల కోసం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు

## తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర రవికుమార్

**డాక్టర్ సింగం శ్రీనివాసరావుకు సన్మానం**



**బషీర్ బాగ్ వెలుతురు 30 అక్టోబర్ :**
తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీ డాక్టర్ సింగం శ్రీనివాస్ రావు ను అమీర్ పేట్ లోని శ్రీ కనక దుర్గా దేవి ఆలయ నూతన ట్రస్ట్ మెంబర్ గా నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థలలో రాష్ట్రంలో నాలుగు స్తంభాలాట మొదలవుతుందని బిజెపి బిఆర్ఎస్ కాంగ్రెస్ దీటుగా తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ పోటీలో నిలబడుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్టార్ క్యాంపినర్ కూనప రెడ్డి హరి ప్రసాద్ శ్రీ సాయిరాం విజయ రెడ్డి ఉదయ్ సింగ్ పాల్గొన్నారు

# డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాలను జయప్రదం చేయండి

**- మండల కార్యదర్శి మెట్టు శ్రవణ్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 30**
భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాలను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి మెట్టు శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. నవంబర్ 2 నుండి 10 వరకు డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. 1980 సంవత్సరంలో ఆవిర్భవించిన డివైఎఫ్ఐ అందరికీ విద్య,ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యాలతో అసమానతలు లేని సమాజం కోసం పనిచేస్తుందన్నారు. నేటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవేవి పట్టించుకోకుండా మాయమాటలు చెప్పి యువతను మోసగించాయని అన్నారు. భగత్ సింగ్ చేగువేరా స్ఫూర్తితో భారత ప్రజాతంత్ర యువజన సమైక్య డివైఎఫ్ఐ ఉద్యమిస్తుంది అన్నారు.

# మండలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

**- రామన్నపేట ఎస్సై డి. నాగరాజు**




**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 30**
రామన్నపేట మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా!మెంథా తుపాన్ తీవ్రత ద్రుష్ట అప్రమత్తంగా ఉండండి.ఉర్లలోని చెరువులు, కుంటలు నిండుకుండల ఉన్నాయి కనుక జాగ్రతగా ఉండండి. వాగులు దాటి ప్రయాణం చేయవద్దు.రోడ్ల పై ప్రయాణించే సమయం లో ప్రత్యేక జాగ్రతలు పాటించండి.లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యవసర పరస్థితి తప్ప బయటకు రాకండి.కరెంటు స్థంబాలు, వైర్లు ముట్టుకోవద్దు, మరియు పశువులను కూడా వర్షాలకు బయటకు వదలకుండా చూడగలరు. చిన్నారులు, వృద్దులు, మహిళలు, బయటకు రావద్దు.మూసి పరివాహక ప్రాంతాలలో మూసి నదిలోనికి పశు వులని గాని మరియు చేపలు పట్టడానికి గాని ఎవ్వరు వెళ్ళవద్దు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడువకుండా టార్పాలిన్ కప్పాలి. అత్యవసర పరిస్థితిలో వెంటనే పోలీసులను Dial 100 or%112 ద్వార గాని రామన్నపేట పోలీస్ స్టేషన్ 8712662809 గాని సంప్రదించండి

# విద్యార్థి దశనుండే సేవా భావాన్ని అలవర్చుకోవాలి

**- ఇంటర్ బోర్డు జాయింట్ కార్యదర్శి బీమ్ సింగ్.**



**తిరుమలగిరి (సాగర్) వెలుతురు న్యూస్ అక్టోబర్ 30:**
విద్యార్థి దశ నుండి విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని ఇంటర్ బోర్డు జాయింట్ కార్యదర్శి భీమ్ సింగ్ కోరారు. మండల పరిధిలోని జమ్మన కోట, నాగార్జున పేట లలో జాతీయ సేవా పథకం యూనిట్ 1&2 శీతాకాల ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమంకు హాజరు అయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజసేవ అవగాహన కలిగి ఉండాలనీ ఆయన తెలిపారు. జాతీయ సేవా పథకం వాలంటీర్లు సామాజిక, ఆర్థిక, మూడ నమ్మకాలు నియంత్రణ, శిశు విక్రయాల నివారణ అవగాహన కల్పించాలని కోరారు. వాలంటీర్లు టెక్నాలజీ పట్ల ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని కోరారు. నూతన సాంకేతిక విధానాన్ని వల్ల అవగాహన లేమి కారణంగా ప్రజలు మోస పోతున్నారని, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు రాజశేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ చింతపల్లి వెంకటయ్య, ప్రసన్నలక్ష్మి, సతీష్ చంద్ర, బంగారు ఉపేంద్రా చారీ, గోపాలకృష్ణ, జనార్దన్, సైదమ్మ, మాధురీ,శంకర్, మణి, గోపినాథ్, హెడ్మాస్టర్ భాస్కర్ గౌడ్, గోపయ్య, ఉపాధ్యాయులు కవిత, తనూజ తదితరులు ఉన్నారు. అనంతరం వాలంటీర్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

## శిశు విక్రయాలు, అక్రమ దత్తతకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు

**- డి డబ్ల్యూ ఓ. కృష్ణవేణి**



**తిరుమలగిరి ( సాగర్ ) వెలుతురు న్యూస్ అక్టోబర్ 30:**
శిశు విక్రయాలు, బృణ హత్యలు బాల్య వివాహాలపై తిరుమలగిరి సాగర్ మండల సెక్టార్ మీటింగ్లో జిల్లా అంగన్వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమంలోజిల్లా సంక్షేమ అధికారిని కే కృష్ణవేణి మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు శిశు విక్రయాలు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు ఇటువంటి చర్యలకు పాల్పడితే కేసుల నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు మహిళలు గర్భం దాల్చిన మూడవ నెలలోనే అంగన్వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ఇద్దరు ఆడపిల్లలు ఉండి మళ్ళీ కాన్పులో ఆడపిల్ల పుడితే వారిని అమ్మకం పెట్టకుండా ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందించినట్లయితే వారిని శిశు గృహాలకు అప్పగించడం జరుగుతుందని తెలపడం జరిగింది. భ్రూణ హత్యలు బాల్య వివాహాలకు పాల్పడే వారిపై సమాచారాన్ని ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సువర్ణ ఐసిడిఎస్ సూపర్వైజర్ యాదమ్మ డిసిపియు మహేష్ మరియు అంగన్వాడీ టీచర్స్ పాల్గొనడం జరిగింది. శిశువిక్రయాలు అక్రమ దత్తతకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకొనబడునని డి డబ్ల్యూ ఓ కృష్ణవేణి అవగాహన కల్పించారు

## విమానంలో గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు):**
జెడ్డా నుంచి శంషాబాద్ వస్తున్న విమానంలో ప్రయాణికుడికి గుండెపోటు వచ్చింది. జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానంలో నగరంలోని అంబర్‌పేటకు చెందిన మహ్మద్ ఖాసీం(79)కు ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ అవుతుందనగా చాతీలో నొప్పి వస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి చెప్పారు. వారు అతనికి సీపీఆర్ చేశారు. ఉదయం 9.27 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ అయిన వెంటనే ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఖాసీంను పరిశీలించిన డాక్టర్లు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో అంబర్‌పేటలోని స్వగ్రహానికి తరలించారు.

# జహీరాబాద్‌లో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**- ఎస్ఎఫ్ఐ బంద్‌కి డివైఎఫ్ఐ మద్దతు...**
**- విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం డిమాండ్...**




**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:**
ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జహీరాబాద్ పట్టణంలో విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జహీరాబాద్ ఏరియా అధ్యక్షుడు హరీశ్, డివైఎఫ్ఐ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జహీరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంటర్మీడియట్ కళాశాలలను బంద్ చేయడం జరిగిందని వారు తెలిపారు. కోర్సులు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇవ్వకపోవడం వలన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభి, చిన్న, కోటిరెడ్డి, సాయి గౌడ్, ప్రసాద్, భారత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగడ్డలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 30 :**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఎర్రగడ్డ డివిజన్లోని జనప్రియ అపార్ట్మెంట్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి మాగంటి గోపీనాథ్ ఎమ్మెల్యేగా ఈ నియోజకవర్గంలో మరియు జనప్రియ అపార్ట్మెంట్లో అనేక అభివృద్ధి పనులు చేశారని. మరల మీరు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ గారిని భారీ మెజార్టీతో గెలిపించి మీ బస్తీలను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్చార్జీలు స్థానిక నాయకులు మరియు నారాయణఖేడ్ నాయకులు తదితరులు ఉన్నారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

**- క్షేత్ర స్థాయిలో పంట నష్టం అంచనా వేయాలి, నష్ట పరిహారం చెల్లించాలి**
**- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్**




**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 30:**
మెంతా తుపాన్ తో కురిసిన భారీ వర్షాల వల్ల నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అరగాళం కష్టం చేసి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో మెంతా తుపాన్ తో వరి ధాన్యం, పత్తి పంట నేలమట్టం అయ్యిందని, కళ్ళల్లో వడ్లు తడిసయాని, పత్తి నీటితో తడిసి ముద్ద అయ్యిందని,రైతులకు కన్నీరే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రెవిన్యూ, వ్యవసాయ అధికారులతో క్షేత్ర స్థాయిలో పంట నష్టం పై అంచనా వేసి వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని, తడిసిన ధన్యాన్ని, పత్తి ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని అన్నారు ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోకుండా నిర్లక్ష్యం చేస్తే పండించిన పంటలకు చేసిన అప్పులు కట్టలేక ఆత్మ హత్యలు చేసుకునే పరిస్థితులు దాపురిస్తాయని వెంటనే ప్రభుత్వ అధికారులు పంట నష్టం పై అంచనాలు వేసి వారికీ భరోసా కల్పించాలని సృజన్ కుమార్ కోరారు.

# కపిల్ బాల కుటీర్ సి సి ఐ హోమ్ లో స్వచ్ఛభారత్




**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 30:**
కరీంనగర్ పట్టణం లోని కపిల్ బాల కుటీర్ సీసీఐ హోమ్ లో గురువారం రోజున స్వచ్ఛభారత్ కార్యక్రమం జరిగింది. అంతకుముందు సీసీఐ హోం ను సిడబ్ల్యుసి మెంబర్ కళింగ శేఖర్ , డిసిపిఓ పర్వీన్ , డి సి పి యు పూదరి శాంత లు సందర్శించి , మేనేజ్మెంట్ కమిటీ మీటింగ్ లో పాల్గొని సీసీఏ హోమ్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆశ్రమంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడుతూ హోమ్ లో ఉంటున్న విద్యార్థిని విద్యార్థులు మన చుట్టూ ఉన్న ప్రాంతాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని , అనారోగ్యం దరిచేరదన్నారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న పిల్లలందరూ లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థితికి రావాలన్నారు. ఇట్టి కార్యక్రమంలో కపిల్ బాలకుటీర్ ఉపాధ్యక్షులు రాజారెడ్డి, ఇంచార్జ్ వకుళాదేవి , కృష్ణవేణి, శ్రీనివాస్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# బొమ్మకల్ లో దేవుడి స్థలాన్ని కాపాడండి ...

**- తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకొని దేవుడి స్థల విషయంలో కాలనీ ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోండి..**
**- జిల్లా కలెక్టర్ , పోలీసు ఉన్నతాధికారులకు శ్రీ రాజరాజేశ్వర నగర్ కాలనీ పబ్లిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఫిర్యాదు..**



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 30:**
కరీంనగర్ పట్టణం బొమ్మకల్ శివారు సర్వేనెంబర్ 125, 126, 129 లోని 10 ఎకరాల భూమిలో లోగోడ లేఔట్ చేసి , దేవుడి గుడి నిర్మాణం కోసం స్థలం విడిచిపెడితే నేడు కొంతమంది ఆ స్థలంపై తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని , ఈ విషయంలో విచారణ జరిపి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శ్రీ రాజరాజేశ్వర నగర్ కాలనీ పబ్లిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గాండ్ల లక్ష్మీనారాయణ, అసోసియేషన్ బాధ్యులు, కాలనీ ప్రజలు గురువారం రోజున జిల్లా కలెక్టర్కు, పోలీసు ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేశారు. 1989 లో చేసిన ఇక్కడి లేఔట్ లో 270 ప్లాట్లు చేశారని , ఇందులో గుడి నిర్మాణం కోసం స్థలం విడిచిపెట్టారని తెలిపారు. అయితే కాలనీవాసుల సహకారం తో హనుమాన్ దేవాలయం నిర్మాణం చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. అయితే శ్రీకర్ అనే వ్యక్తి 2025 సంవత్సరంలో దేవుడి స్థలం కబ్జా చేయడానికి ఆ స్థలాన్ని తప్పుడుగా రిజిస్టర్ చేసుకొని కాలనీ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదులో వివరించారు. కనుక తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థలం విషయంపై తగిన విచారణ చేపట్టి, అక్రమంగా తప్పుడు గా రిజిస్ట్రేషన్ చేసుకుని కాలనీ ప్రజలను ఇబ్బందులను గురిచేస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



## వినూత్నంగా రావి ఆకుపై ఉక్కుమనిషి చిత్రాలు 150వ జయంతి శుభాకాంక్షలు



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 30 :**
నారాయణఖేడ్ పట్టణంలో స్వతంత్ర భారత తొలి ఉప ప్రధాని తొలి హోం మంత్రిగా దేశాన్ని ఏక ఖండంగా తీర్చిదిద్ది మనలో సమైక్య స్ఫూర్తిని నింపిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ సమైక్యత దినోత్సవం గా జరుపుకుం టున్నాం.. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అశ్వత్థ పత్రాలపై ఉక్కుమనిషి చిత్రాలతో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ...

# మున్నేరు వాగు ఉధృతితో మరోమారు ఆందోళన

**- ఖమ్మం-బొమ్మకల్ రహదారిపై భారీగా వరద**

**ఖమ్మం,అక్టోబర్30( వెలుతురు):**
మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు ఖమ్మంలోని 'మున్నేరు' వారు మరోమారు ఉధృతంగా సాగుతోంది. అంతకంతకూ నీటిమట్టం పెరగడంతో మరోమారు భయాందోళనలు మొదలయ్యాయి. వాగు పరివాహకంలోని కాలనీలను వరద చుట్టుముట్టింది. మోతీనగర్, బొక్కలగడ్డ కాలనీల్లోకి వరద చేరింది. మోతీనగర్‌లోని 35, బొక్కలగడ్డలో 57 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మున్నేరుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 24.7 అడుగులకు చేరింది. ఎగువన భారీ వర్షాలతో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండటం తో వరద నీరు ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై చేరింది. ఖమ్మం నగరం సమీపంలోని దంసలాపురం వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై మూడు అడుగుల మేర వచ్చింది. దీంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలో లో లెవెల్ వంతెనపై వరద ప్రవహిస్తోంది. పాలేరు జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ఖమ్మంలోని రాపర్తి నగర్ బీసీ కాలనీ వద్ద డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. టీఎన్జీవోస్ కాలనీని నలువైపులా వరద నీరు ముంచెత్తడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని ఏదులాపురం పరిధిలో కేబీఆర్ నగర్, ప్రియదర్శిని కళాశాల ప్రాంతంలో ఉన్న ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది.

## హరీష్ రావుకు కవిత దంపతుల పరామర్శ

**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు):**
మాజీ మంత్రి హరీష్‌రావు ఇంటికి కల్వకుంట్ల కవిత వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. భర్తతో కలసి వెళ్లి హరీష్ రావును పరామర్శించారు. రెండు రోజుల క్రితం హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ సందర్భంలో కవిత అంత్యక్రియలకు హాజరుకాలేదు. దీనితో హరీష్‌రావుతో ఉన్న విభేదాల కారణంగానే రాలేదని అనేక ఊహాగానాలు చెలరేగాయి. అయితే మూడు రోజుల తర్వాత, గురువారం ఉదయం కవిత హరీష్‌రావు నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను కలుసుకున్నారు. సత్యనారాయణరావు మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. కాసేపు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పినట్లు తెలుస్తోంది. అయితే.. గతంలో మాజీ మంత్రి హరీష్‌రావుపై సంచలన ఆరోపణలు చేశారు కవిత. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి వ్యవహారంలో హరీష్‌రావుపై మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై హరీష్‌రావు ప్రత్యక్షంగా స్పందించలేదు. తాను ఉద్యమం నుంచి ఉన్నారని, తన ప్రస్థానం తెరిచిన పుస్తకమంటూ పరోక్షంగా స్పందించారు. కవిత హరీష్‌రావుపై చేసిన ఆరోపణల అనంతరం ఆమె ఆయన ఇంటికి వెళ్లడం ఇదే తొలిసారి. ఈ తాజా తరుణం అటు బీఆర్ఎస్ ఇటు జాగృతి శ్రేణుల్లో ఆసక్తి రేకెత్తించింది.

## ప్యారడైజ్ ఎలివేటెడ్ కారిడార్ పనులు

**- 9 నెలల పాటు ట్రాఫిక్ మళ్లింపు**

**హైదరాబాద్,అక్టోబర్30( వెలుతురు):**
ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీఫామ్ రోడ్ వరకు జాతీయ రహదారి 44 పై ఎలివేటెడ్ కారిడర్ నిర్మాణం పనులు ప్రారంభం సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని జాయింట్ కమిషనర్ డి. జోయల్ డేవిస్ తెలిపారు. ఈనెల 30 నుంచి 9 నెలలపాటు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయన్నారు. రాజీవ్ గాంధీ విగ్రహం జంక్షన్ నుండి బాలంరాయ్ వరకు రహదారిని మూసివేస్తున్నా మన్నారు. బాలంరాయ్ నుంచి సీటీవో జంక్షన్‌కు వెళ్లే వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

బాలనగర్ వైపు నుంచి పంజాగుట్ట ట్యాంక్ బండ్ వైపు వెళ్లేవారు తాడ్‌బండ్ మస్తాన్ కేఫ్, డైమండ్ పాయింట్ కుడివైపు మలుపు తిరిగి మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. సుచిత్ర వైపు నుంచి పంజాగుట్ట, ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వారు సేఫ్ ఎక్స్‌ప్రెస్ ఎడమవైపు మలుపు తిరిగి బాపూజీనగర్, సెంటర్ పాయింట్, డైమండ్ పాయింట్, మడ్‌ఫోర్ట్, ఎన్‌సీసీ, జేబీఎస్, ఎస్‌బీఐ మార్గంలో వెళ్లాలని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ రాణిగంజ్, పంజాగుట్ట, రసూల్‌పురా, ప్లాజా వైపు నుంచి సీటీఓ జంక్షన్ ద్వారా తాడ్‌బండ్ వైపు వెళ్లేవారు రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్ నుంచి అన్నానగర్, బాలంరాయ్, తాడ్‌బండ్ ద్వారా పంజాగుట్ట, ట్యాంక్ బండ్ వైపు వెళ్లేవారు మీటింగ్ పాయింట్ బైలేన్, హాకీ గ్రౌండ్ బైలేన్, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ మార్గాలను ఉపయోగించాలని జాయింట్ సీపీ సూచించారు.

ట్రాఫిక్ సమాచారం కోసం హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సోషల్ మీడియా ఎ÷-లాట్‌ఫారంలను చూడవచ్చని, ప్రయాణ సమయంలో అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626కి కాల్ చేయవచ్చన్నారు.

# బీసీ బిడ్డ నవీన్ యాదవ్ కే మాల మహానాడు మద్దతు

**- జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య**




**బషీర్ బాగ్ వెలుతురు 30 అక్టోబర్ :**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బలహీన వర్గాల బిడ్డ నవీన్ యాదవ్ కు మాల మహానాడు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య తెలియజేశారు ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీతో విభేదించి మాల మహానాడు పోరాటం చేస్తున్నప్పటికీ. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో బిసి ఎస్సి ఎస్టి వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ఉండగా ప్రధాన రాజకీయ పార్టీలలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే సామాజిక న్యాయం దిశగా బలహీన వర్గాల అభ్యర్థిని నిలిపినందున ఆ పార్టీ అభ్యర్థి అయిన నవీన్ యాదవ్ కు మద్దతు తెలపాలని మాల మహానాడు నిర్ణయించింది ఈ మేరకు నవీన్ యాదవ్ కు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని నవీన్ యాదవ్ గెలుపు కోసం మాల మహానాడు కార్యకర్తలు పని చేయాలని చెన్నయ్య పిలుపునిచ్చారు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర క్యాబినెట్లో సరైన ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు సామాజిక న్యాయం దిశగా భారత రాజ్యాంగాన్ని కాపాడడానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుండడంతో పాటు మతోన్మాద శక్తులు బలపడకుండా చూడవలసిన బాధ్యత లౌకికవాదులపై ఉందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు తెలిపారు ఈ సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా రంజిత్ కుమార్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాసులు , మాలమానాడు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం సరళ, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శులు మర్పల్లి శ్రీకాంత్, పి జై కుమార్, అనిల్ కుమార్, రాకేష్, యాదాద్రి జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమతి లలిత, రామలీల, నాయకులు నర్సింగ్ రావు, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

# జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యం

కూడా లేరు. దీనిని ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇలాంటి వేళ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2023 ఏడాది చివరిల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అజారుద్దీన్ బరిలో నిలిచి.. రెండో స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో అజారుద్దీన్‌తోపాటు తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొ. కొదండరామ్‌ను గవర్నర్ కోటాలో శాసనమండలికి పంపాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన దస్త్రాన్ని గవర్నర్‌కు పంపింది. కానీ దీనికి గవర్నర్ ఆమోదం లభించలేదు. దీంతో అజారుద్దీన్‌కు తొలుత మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది. దీనికి బీఆర్ఎస్, బీజేపీలో మోకాలడ్డుతు న్నాయంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు గుప్పిస్తోంది. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నవంబర్ 11వ తేదీన జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న వెలువడనున్నాయి. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు బీజేపీ ఎత్తులు వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. అందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సరెండర్ అయిందని.. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్‌కు బీజేపీ సరెండర్ అయిందని ఆరోపించారు. ఆ క్రమంలోనే బీఆర్ఎస్‌కు లబ్ది చేకూర్చేందుకే అజారుద్దీన్‌పై ఎన్నికల కమిషన్‌కు బీజేపీ ఫిర్యాదు చేసిందని తెలిపారు. అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం జరగకుండా ఉండేందుకు గవర్నర్‌పై బీజేపీ ఒత్తిడి తెస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెలుపల ఎన్నికల కోడ్ లేదన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో విలేకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విలేకర్లతో మాట్లాడుతూ.. రాజస్థాన్‌లోని కరగ్‌పూర్ నియోజకవర్గంలో పోలింగ్‌కు ముందు అభ్యర్థిని మంత్రిగా బీజేపీ ప్రకటించిందన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అజారుద్దీన్.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో అభ్యర్థి కూడా కాదు. అయినా అభ్యంతరం ఎందుకు అంటూ సందేహం వ్యక్తం చేశారు.అ అయితే తమ ప్రభుత్వానికి స్పష్టత, సంకల్పం ఉందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## తుపాను నష్టం రూ.5,265 కోట్లు



చెప్పారు. తుపాను వల్ల ఎవరూ ప్రాణాలు కోల్పోలేదన్న ఆయన.. 120 పశువులు మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి ఈసారి నష్టం తక్కువే ఉందన్నారు. తుపాను నష్టంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. నష్టం వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి కుటుంబాన్ని, ఇంటినీ జియోట్యాగింగ్ చేయగలిగాం. తుపాను వల్ల మారుతున్న పరిణామాలకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకున్నాం. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగినా 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగింది. అధికారులు అందరూ నిబద్ధతతో పని చేశారు. చాలా సంతోషంగా ఉందన్నారు. . ఓ వైపు వర్షం పడుతున్నా.. కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారు. గతంలో చెట్లు కూలితే.. తొలగించేందుకు వారం పట్టేది. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు.. ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని చంద్రబాబు తెలిపారు. మొంథా తుపాన్ మనతో దాగుడుమూతలు ఆడి.. సమస్యలు సృష్టించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. అయితే టెక్నాలజీ సాయంతో ఈ తుపాన్ నష్టాన్ని తగ్గించామని ఆయన చెప్పారు. అంతర్వేది వద్ద తీరం దాటడంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయన్నారు. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా తుపాన్ పరిస్థితిని అంచనా వేశామన్నారు. అంతర్వేది వద్ద తీరం దాటి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని చెప్పారు.అయితే కాకినాడలో ఈ తుపాన్ క్రాస్ చేస్తుందని అనుకున్నామని.. కానీ చివరకు నరసాపురం వద్ద తీరం దాటిందని సీఎం చంద్రబాబు వివరించారు. వారం రోజుల్లోనే పరిస్థితులను చక్కదిద్దామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేశామని.. అయితే అనుకున్న చోట కాకుండా వేరే ప్రాంతాల్లో వర్షాలు కురిశాయని వివరించారు. ఈ తుపాన్ తీరం దాటినా.. తెలంగాణలో వర్షాలు అధికంగా కురిశాయని తెలిపారు. గతంలో బుడమేరు వరదను సైతం ఎదుర్కొన్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేశామన్నారు. విపత్తుల సమయంలో అన్నింటినీ సరిచేశామని చెప్పారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాలను యాక్టివ్ చేశామన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాలో అధికంగా వర్షాలు పడ్డాయని తెలిపారు. వర్షాల వల్ల వరదలు వచ్చాయని.. పులిచింతల వద్ద భారీగా వరద నీరు వచ్చి చేరిందని వివరించారు. పంట నష్టంపై నివేదిక అందజేయాలని అధికారులను సీఎం చంద్రబాబు కోరారు. ఐదు రోజుల్లో పంట నష్టంపై నివేదిక అందజేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ తుపాన్ కారణంగా.. వరి, మొక్కజోన్న, పత్తి, అరటి, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే.

# విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండాలంటే చదువు ఒక్కటే మార్గం

**-పహడిషరీఫ్ లో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో సీఐ ఎస్.రాఘవేందర్ రెడ్డి**

**వెలుతురు, తుక్కుగూడ అక్టోబర్ 30 :**
సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే చదువు ఒక్కటే మార్గం అని కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థాయికీ వెళ్లవచ్చుని పహడిషరీఫ్ సీఐ ఎస్.రాఘవేందర్ రెడ్డి అన్నారు. పోలీసులు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పహడిష రీఫ్ పోలీసు స్టేషన్ లో గురువారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఓపెన్ హౌస్ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు అమరవీరుల దినోత్సవం సందర్భంగా యువన్ స్కూల్ విద్యార్థులతో పోలీస్ విధులు నిర్వహణ, పోలీస్ ఉపయోగించే ఆయుధాలు గురించి, పోలీస్ అమరవీరుల గురించి వివరించారు. ఎవరికైనా ఎటువంటి ఇబ్బందులు





వచ్చిన డయిల్ 100 లేదా 112 కాల్ చేయాలని తెలిపారు. కుటుంబం సభ్యులు అయినా అసభ్యంగా ప్రవర్తిస్తే అమ్మ నాన్నలకి తెలియజేయాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలుసుకోవాలని, సైబర్ క్రైమ్ గురించి తెలుసుకోవాలి అని, ఆన్లైన్ మోసాలు పట్ల అవగాహనా కలిగి ఉండాలని కోరారు. ఆన్లైన్ లింక్స్ క్లిక్ చేయకూడదు అని, మోసాల పట్ల అవగాహనా కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు పోలీసు వ్యవస్థ ద్వారా బాలికలు, మహిళలు రక్షణకై పోక్సో చట్టం, భరోసా కేంద్రం పనితీరు, షీటీంలు అందిస్తున్న సేవలను విద్యార్థులకు వివరించారు. పోలీసు వ్యవస్థ భయాన్ని పోగొట్టి తమ రక్షణకే అనే నమ్మకాన్ని ప్రజలకు నమ్మకం కల్పించడమే ముఖ్యఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్ర మంలో అడ్మిన్ ఎస్ఐ బి.దయాకర్ రెడ్డి, ఎస్ఐలు వి. లక్ష్మయ్య, ఎండి అహ్మద్, వెంకటేశ్వర్లు, స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ను ప్రారంభించిన సబితా ఇంద్రారెడ్డి

**-పోచంపల్లి కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్**
**-సీఈఓ సీత శ్రీనివాస్**

**వెలుతురు, మహేశ్వరం, అక్టోబర్ 30 :**
మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్పేట్ పాత గ్రామపంచాయతీ సర్కిల్ లో కొత్తగా ఏర్పాటైన పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన బ్రాంచ్‌ను మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజలకు బ్యాంకింగ్ సేవలు సులభంగా అందుబాటులోకి రావడం ఆనందదాయకమని తెలిపారు.



బ్యాంక్ విస్తరణతో ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తడక రమేష్ చైర్మన్, భారత రాజేంద్రప్రసాద్ వైస్ చైర్మన్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలె హరిశంకర్, సూరిపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నా ట భార్గవి,కొండమడుగు ఎల్లస్వా మి,మక్తాల నర్సింహ, బిట్టు భాస్కర్, సిఇఓ సీత శ్రీనివాస్, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రామీడి రామిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సుర్జగంటి అర్జున్, పెద్దబావి ఆనందరెడ్డి, ఏనుగు రామిరెడ్డి, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, పుట్టగళ్ళ సంతోష్, పెద్దబావి మహేందర్ రెడ్డి, కర్రె బల్వంత్, అర్కల కామేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తేనెటీగల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులపై రైతులకు శిక్షణ

**- తేనెటీగల సంరక్షణతో రైతుల ఆదాయం రెట్టింపు - శాస్త్రవేత్తల సూచన**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని డీడీఎస్ – కృషి విజ్ఞాన కేంద్రం (KVK) ఆధ్వర్యంలో, అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (ATARI) సహకారంతో మూడు రోజులపాటు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభ సదస్సులో సీనియర్ శాస్త్రవేత్త డా. సి. వరప్రసాద్ మాట్లాడుతూ, రైతులు ఆధునిక పద్ధతులు పాటించినప్పటికీ పంటల దిగుబడులు తగ్గడానికి పరపరాగ సంపర్కం లోపించడమే ఒక ప్రధాన కారణమని తెలిపారు. తేనెటీగల పెట్టెలను పంటలలో ఉంచడం ద్వారా దిగుబడి 9 నుండి 25 శాతం వరకు పెరుగుతుందని వివరించారు.



రైతులు తేనెటీగలను సంరక్షిస్తూ సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. కోర్స్ ఇన్‌చార్జ్ డా. ఎన్. స్నేహలత, సస్యరక్షణ శాస్త్రవేత్త, తేనెటీగల రకాలు, వాటి ప్రాముఖ్యత, తేనె ఉత్పత్తి విధానం, పురుగు – రోగాల యాజమాన్యం, తేనె తీసే పద్ధతులు, బాక్స్ హ్యాండ్లింగ్ విధానంపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త రమేష్ తేనెటీగలు పంటల పరపరాగ సంపర్కానికి చేసే మేలును వివరించగా, డా. సాయి



ప్రియాంక తేనె పరిశ్రమకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పథకాలు, శిక్షణా కార్యక్రమాల వివరాలు తెలిపారు. మూడవ రోజు ముగింపు కార్యక్రమంలో కేవీకే సిబ్బంది పాల్గొన్న 20 మంది రైతులు, యువతీ – యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# క్రమశిక్షణ గల కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా కార్యకర్తగా అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కూడా దానికి కట్టుబడి ఉంటా

**- పార్టీ మారుతున్నానని కావాలని టిఆర్ఎస్ వాళ్లు, మా పార్టీలోని కొందరు నాపై దుష్ప్రచారం చేస్తున్నారు**
**- రాజకీయంగా నేను ఏదైనా నిర్ణయం తీసుకోవాలనుకున్నప్పుడు నేనే ప్రెస్ మీట్ పెట్టి చెబుతాను**
**- నాపై సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారాలను నమ్మొద్దు**
**- కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 30:
యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని లక్కారం, చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని చెరువులను పరిశీలించి గంగ పూజను నిర్వహించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ మున్సిపాలిటీ లోని చెరువు నిండినప్పుడు కాలనీలు జలమయం కాకుండా తీసుకోవలసిన చర్యలతో అధికారులతో చర్చించిన ఎమ్మెల్యే. కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారి కామెంట్స్,... చౌటుప్పల్ మున్సిపాలిటీ డెవలప్మెంట్ కు 500 కోట్ల రూపాయలతో ప్రణాళిక రూపుదిద్దబోతుంది చౌటుప్పల్ చెరువు నుండి ఏలాంటి నష్టం జరగకుండా ముందస్తుగా ప్రణాళికలు వేసి దండు మల్కాపురం, లక్కారం వద్ద వరదనీరును డైవర్ట్ చేయడంతో మున్సిపాలిటీ ప్రజలకు వరద ముప్పు తప్పింది. పార్టీ మారుతున్నానని సొంత పార్టీ వాళ్లు, బయట పార్టీ వాళు నాపై కావాలని దుష్ప్రచారం చేస్తున్నారు ప్రజలు





దుష్ప్రచారాలను ఎవరు నమ్మవద్దు. నేను ఏదైనా నిర్ణయం తీసుకున్నట్లయితే స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి మరి ప్రకటిస్తా నేను ప్రస్తుతం సిన్సియారిటీ కలిగిన కాంగ్రెస్ కార్యకర్త ,మరియు ఎమ్మెల్యేను పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే పని చేస్తాను. నా ముందు మునుగోడు అభివృద్ధి తప్ప, మరో ఆలోచన లేదు.

# చిన్నారుల ఆకలి తీర్చిన అంగన్వాడిలు

**- అభినందించిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 30:**
హన్మకొండలోని సమ్మయ్యనగర్, అమరావతినగర్, టీవీ టవర్ ప్రాంతాలు ఇటీవల వరదలతో తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ పరిస్థితుల్లో వరద ప్రభావిత ప్రాంతాల నుండి రక్షించబడిన చిన్నారుల ఆకలి తీర్చడానికి అంగన్వాడీ సిబ్బంది విశేష సేవలు అందించారు. పిల్లల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని, అంగన్వాడీ టీచర్లు మరియు హెల్పర్లు వేడిగా వండిన బాలమృతం ను చిన్నారులకు అందించారు. మంగళవారం నాడు అంగన్వాడి కేంద్రాలకు సెలవులు ప్రకటించినా..అంగన్వాడి సిబ్బంది విధుల్లోనే ఉండి వరద ప్రభావిత ప్రాంతాల్లో నీ చిన్నారుల బాగోగులు చూసుకున్నారు. స్వయంగా బాలామృతం వండి వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని వేడివేడి బాలామృతాన్ని వడ్డించారు. సిబ్బంది తీసుకున్న ఈ మానవతా దృక్పథంతో కూడిన చొరవను మహిళా శిశు



సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందించారు. “అవసర సమయంలో ప్రజల కోసం అంగన్వాడీలు నిలబడటం, చిన్నారుల ఆకలి తీర్చడం గొప్ప సేవ” అని మంత్రి సీతక్క ప్రశంసించారు.అంగన్వాడీ వ్యవస్థ సామాజిక సేవలో ఒక కాంతి దీపంలా నిలుస్తుందని పేర్కొన్నారు. మొంథా తుఫాను నేపథ్యంలో కూడా అంగన్వాడీ సిబ్బంది చూపుతున్న నిబద్ధత, సేవా భావం పట్ల మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శ్రీమతి శృతి ఓజా కూడా అభినందనలు తెలియజేశారు.



# ఫీజు బకాయిలు అడిగితే విజిలెన్స్ దాడులా?

**- రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ బండి**

**హైదరాబాద్,అక్టోబర్ 30( వెలుతురు):**
ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే కాలేజీలపై విజిలెన్స్ దాడులు చేయించడం దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు బకాయిల కోసం కాలేజీ యాజమాన్యాలు, విద్యార్థులు, సిబ్బంది ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 6 గ్యారంటీలు ఇస్తామని ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏం చేయాలి? మాట తప్పిన కాంగ్రెస్ నేతలపై విజిలెన్స్ దాడులు చేస్తారా? ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో 15 లక్షల మంది విద్యార్థులు అల్లాడుతున్నా సోయి లేదా? అని ప్రశ్నించారు. సర్టిఫికెట్లు రాక, ఉద్యోగాల్లో చేరలేక, ఉన్నత చదువులకు వెళ్లలేక విద్యార్థులు ఆందోళన పడుతున్నరన్నారు. నాలుగేళ్లుగా ఫీజు బకాయిలు చెల్లించకపోతే విద్యా సంస్థలు నడిచేదెలా? అధ్యాపకులకు జీతభత్యాలు, అ÷–దదె, మెయింటెనెన్స్ ఛార్జీలు చెల్లించేదెలా? అని నిలదీశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ పథకానికి తూట్లు పొడుస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఫీజు బకాయిల కోసం ఎందాకైనా పోరాడాన్నారు. కాలేజీలు, విద్యార్థుల పోరాటానికి బీజేపీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు.

# దేశ విపత్తు నిర్వహణ వ్యవస్థకు వెన్నెముక

# ఎన్‌డిఆర్‌ఎఫ్



- కొత్త రకాల విపత్తులను ఎదుర్కొనడానికి ఎన్డీఆర్ఎఫ్ సిద్ధమైంది
- మీ త్యాగాలు దేశం ఎన్నటికీ మరువదు
- మీ ధైర్యం, అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తి
- ఈ ఒక్క ఏడాదిలోనే 1600 మంది ప్రాణాలను కాపాడారు
- 38 వేల మందిని సురక్షితంగా తరలించారు
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- న్యూఢిల్లీలో ఎన్‌డిఆర్‌ఎఫ్ అమరవీరుల సంస్మరణ సభకు హాజరై ప్రసంగించిన కేంద్ర మంత్రి



**న్యూఢిల్లీ వెలుతురు అక్టోబర్ 30:** దేశ విపత్తు నిర్వహణ వ్యవస్థకు ఎన్‌డిఆర్‌ఎఫ్ వెన్నెముక వంటిదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అటవీ అగ్నిప్రమాదాలు, పర్వత రక్షణ చర్యలు, సీబీఆర్ఎన్ (Chemical, Biological, Radiological, Nuclear) వంటి కొత్త రకాల విపత్తులను ఎదుర్కొనడానికి ఎన్డీఆర్ఎఫ్ సిద్ధమైందని చెప్పారు. విపత్తు గురైన ప్రజలను కాపాడేందుకు ప్రాణాలు కోల్పోయిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది త్యాగాలు దేశం ఎన్నటికీ మరువదన్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ధైర్యం, అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తి అని కొనియాడారు. గురువారం రోజున న్యూఢిల్లీలో న్యూఢిల్లీలో ఎన్‌డిఆర్‌ఎఫ్ అమరవీరుల సంస్మరణ సభకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. సంస్థ మెంబర్ సెక్రటరీ రాజేంద్ర సింగ్ , సభ్యులు రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ అటా హుస్సేన్ , డీజీ పీయూష్ ఆనంద్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద ఘన నివాళి అర్పించిన కేంద్ర మంత్రి అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారితో కలిసి ఫొటో దిగారు. అనంతరం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. అందులోని ముఖ్యాంశాలు... దేశ భద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన ఎన్డీఆర్ఎఫ్ అమరవీరులకు ఘన నివాళి అర్పించడం ద్వారా వారి సేవలను, త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన సమయమిది. ఈ స్మారక చిహ్నం కేవలం రాతి నిర్మాణం కాదు, మన ఎన్డీఆర్ఎఫ్ సైనిక దళాలు, రాష్ట్ర పోలీస్ బలగాల వీరత్వం, నిబద్ధత, అచంచల కర్తవ్య భావానికి ప్రతీక. ఈ రోజు దేశ సేవలో తమ వారిని కోల్పోయిన కుటుంబాల మధ్య ఉండటం నాకు గర్వం మరియు గౌరవంగా ఉంది. నేను మీ అందరికీ వందనాలు తెలియజేస్తూ, దేశం ఎల్లప్పుడూ వారి త్యాగాన్ని స్మరించుకుంటుందని, వారి ధైర్యం మరియు అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని హామీ ఇస్తున్నా. మన పోలీస్ బలగాలు, అందులో అర్ధసైనిక దళాలు మరియు రాష్ట్ర పోలీస్ దళాలు, దేశ భద్రత మరియు శాంతి పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వారి ధైర్యం మరియు త్యాగం వల్లే మనం సరిహద్దులను రక్షించగలుగుతున్నాము, అంతర్గత భద్రతను కాపాడగలుగుతున్నాము, ఉగ్రవాదం, నక్సలిజం వంటి ప్రమాదాలను ఎదుర్కొనగలుగుతున్నాము. ఎన్‌డిఆర్‌ఎఫ్ మన దేశ విపత్తు నిర్వహణ వ్యవస్థకు వెన్నెముక వంటిది. ఈ ఎన్డీఆర్ఎఫ్ చూపుతున్న క్రమశిక్షణ, సాంకేతిక నైపుణ్యం, త్యాగభావం ప్రపంచస్థాయి ప్రశంసనీయమైనది. ఏ విపత్తు వచ్చినా, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు సిద్ధంగా ఉండటం గొప్ప విషయం. 2013లో ఉత్తరాఖండ్‌లోని కేదార్‌ఘాట్ విపత్తు నుండి మొదలు నేటి వరకు ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది ధైర్యసాహసాలు, నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలిచారు. ఈ క్రమంలో 17 మంది వీర జవాన్లను కోల్పోయాం. ఈ రోజు వారి అసమాన ధైర్యానికి ఘన నివాళి అర్పిస్తున్నాను. ఎన్‌డిఆర్‌ఎఫ్ సేవల పరిధి విస్తృతమైంది. దేశ వ్యాప్తంగా 16 బెటాలియన్లు, 28 రీజనల్ రెస్పాన్స్ సెంటర్లు (RRCs) ద్వారా ఈ దళం ప్రతిచోటా సహాయక చర్యలు అందిస్తోంది. ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు విపత్తు స్థలానికి చేరుకుంటే చాలు... పరిస్థితి అదుపులోకి వస్తుందనే నమ్మకం ప్రజల్లో ఉంది. ఇటీవలి కాలంలో కూడా, ఎన్‌డిఆర్‌ఎఫ్ మయన్మార్ భూకంపంలో "ఆపరేషన్ బ్రహ్మ" పేరిట సహాయక చర్యలు చేపట్టింది. ఢిల్లీ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, ఏపీ, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో చోటుచేసుకున్న వర్షాలు, భూకంపాలు, వరదలు వంటి విపత్తుల్లో అసాధారణ సేవలందించింది. ఈ సంవత్సరంలోనే ఎన్‌డిఆర్‌ఎఫ్ 1060కు పైగా రక్షణ చర్యలను విజయవంతంగా నిర్వహించింది. సుమారు 1600 మంది ప్రాణాలను కాపాడటమే కాకుండా 38 వేల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించింది. అటవీ అగ్నిప్రమాదాలు, పర్వత రక్షణ చర్యలు, మరియు CBRN (Chemical, Biological, Radiological, Nuclear) వంటి కొత్త రకాల విపత్తులను సైతం ఎదుర్కోవడానికి ఎన్డీఆర్ఎఫ్ దళాలు సిద్ధమయ్యాయి. అమరవీరుల కుటుంబాలకు నా హృదయపూర్వక నమస్కారాలు. మీ త్యాగం అపూర్వం. మీ ధైర్యం, సహనం చూసి దేశం గర్విస్తుంది. ఈ విధమైన కార్యక్రమాలు కేవలం అమరులకు నివాళులు మాత్రమే కాకుండా, మన జవాన్లకు ఉత్సాహం, ఆత్మవిశ్వాసంను కలిగిస్తాయి. మన దళాల వీరత్వం, అంకితభావం, కర్తవ్య నిబద్ధత దేశ సేవలో మనందరినీ మరింత ఉత్సాహంగా ముందుకు నడిపిస్తాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో, అమిత్ షా మార్గదర్శకత్వంలో ఎన్డీఆర్ఎఫ్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తోంది.

























## పరుగులు పెడుతున్న వైట్ మెటల్



**ముంబై, అక్టోబరు 30, ( వెలుతురు)**

వెండి ధరలు తగ్గాయి. ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గాయి, సురక్షిత స్వర్గధామాలకు డిమాండ్ గణనీయంగా తగ్గింది. అయినప్పటికీ వచ్చే ఏడాది వెండి పెట్టుబడిదారులకు 50 శాతం వరకు రాబడిని అందించగలదని నిపుణులు విశ్వసిస్తున్నారు. గత రెండు వారాల్లో వెండి ధర 18 శాతం తగ్గిన తర్వాత, స్టాక్ మార్కెట్ వెలుపల ఆదాయం కోసం చూస్తున్న పెట్టుబడిదారులు కొత్తగా వెండిని కొనుగోలు చేయడాన్ని పరిగణించవచ్చు. ఇటీవలి బలహీనత ఉన్నప్పటికీ వచ్చే ఏడాది నాటికి వెండి 50 శాతం వరకు తిరిగి వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.రాబోయే కొన్ని నెలల్లో వెండి ధరలు ఔన్సుకు 50–55 డాలర్ల మధ్య స్థిరంగా ఉంటాయని, ఇటీవలి గరిష్టాల నుండి కొంత లాభం కోలుకునే అవకాశం ఉందని మేం విశ్వసిస్తున్నాము అని నిపుణులు అంటున్నారు. 2026 చివరి నాటికి ఇది ఔన్సుకు 75 డాలర్లకి చేరుకోవచ్చు. డాలర్ 90 వద్ద ఉంటే, దేశీయ ధరలు కిలోకు రూ. 240,000కి చేరుకోవచ్చు.అంతర్జాతీయ వెండి ధరలు అక్టోబర్ 16న ఔన్సుకు 54.45 డాలర్ల నుండి 10.9 శాతం తగ్గి 48.59 డాలర్లకి చేరుకున్నాయి, దేశీయ ధరలు అక్టోబర్ 14న కిలోకు రూ.182,500 నుండి 18 శాతం తగ్గి రూ.149,500కి చేరుకున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో మెరుగుదల కారణంగా రిస్క్ అప్పిటైట్ మెరుగుపడటం, సురక్షిత స్వర్గధామాలకు డిమాండ్ పెరగడంతో విలువైన లోహాల పట్ల పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గింది, ఫలితంగా వెండి ధరలు తగ్గాయి. ఈ నెల ప్రారంభంలో భారీ ర్యాలీ తర్వాత ఈ తగ్గుదల వచ్చింది, దీని ఫలితంగా వ్యాపారులు లాభాలను బుక్ చేసుకున్నారు. గత సంవత్సరంలో వెండి డాలర్ పరంగా 44 శాతం, రూపాయి పరంగా 55.72 శాతం రాబడిని ఇచ్చింది.

## ఎంజీఎంలో ఏం జరుగుతోంది...



**వరంగల్, అక్టోబరు 30, ( వెలుతురు)**

వైద్యులను ప్రాణదాతలు అని పిలుస్తుంటారు. కనిపించే దేవుళ్ళుగా రోగులు కొలుస్తుంటారు. అటువంటి గొప్ప పేరు ఉన్న వైద్యులు రోగులకు చికిత్స అందించి.. ఇంకా మంచి పేరు తెచ్చుకోవాల్సి ఉండగా.. చికిత్సను పక్కనపెట్టి దోపిడికి పాల్పడుతున్నారు. అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడి ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టిస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల విభాగంలో అతిపెద్దదైన ఎంజీఎం లో అవినీతి వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇటీవల ఈ ఆసుపత్రిలో ఒకటే ఆక్సిజన్ సిలిండర్ ను ఇద్దరు చిన్నారులకు పెట్టడం చర్చకు దారి తీసింది. దీనిపై మీడియాలో ప్రముతంగా వార్తలు రావడంతో వైద్య శాఖ మంత్రి ఎంజీఎం పై చర్యలు తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే అందులో నిజం లేదని తర్వాత తేలింది.. ఇటీవల ఎంజీఎం లో రోగులపై సెక్యూరిటీ గార్డ్ లు దాడి చేశారు. ఆ దాడికి సంబంధించిన దృశ్యాలు కూడా మీడియాలో విపరీతంగా కనిపించాయి. ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించడం.. మీడియాలో ప్రముఖంగా రావడంతో ఎంజీఎం సూపరిండెండెంట్ పై చర్యలు తీసుకున్నది.ఈ సంఘటన తర్వాత ఎంజిఎం లో ఓ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎంజీఎం లో అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల రెండు కోట్ల నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణ వినిపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ నిధులు స్వాహా కావడంతోపాటు టెండర్లు వేయకుండానే స్టేషనరీ కొనుగోలు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం ఆస్పత్రి వర్గాలలో చర్చకు దారితీస్తోంది. ఎంజీఎం లో పనిచేస్తున్న ఉన్నతాధికారుల్లో ఒకరు ఈ అవినీతి వ్యవహారాన్ని మీడియాకు లిక్ చేసినట్టు తెలుస్తోంది. ఓ వర్గం ఎంజీఎంలో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తోందని.. పై అండలు చూసుకుని అడ్డగోలుగా దోపిడీ చేస్తోందని మరో వర్గం ఆరోపిస్తోంది. మరో వర్గానికి చెందిన ఉన్నతాధికారి మీడియాకు లింకులు ఇవ్వడంతో ఈ వ్యవహారం బయటికి వచ్చింది. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపడితే నిజాలు బయటపడతాయని తెలుస్తోంది. ఎంజీఎం కొత్త బాస్ దీనిపై దృష్టి పెడితే బాగుంటుందని రోగులు అంటున్నారు.ఇటీవల కాలంలో సెక్యూరిటీ గార్డులు కూడా రోగులపై దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్యూరిటీ గార్డులు పై అండదండలు తీసుకొని ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని విమర్శలున్నాయి.. కొత్త బాస్ సెక్యూరిటీ గార్డుల వ్యవహార శైలి పట్ల దృష్టి సారించాలని.. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు. వైద్య సేవల విషయంలో పారదర్శకతను పెంపొందించాలని కోరుతున్నారు.

### భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, అధికారులు అప్రమంత్తగా ఉండలి

**జయశంకర్ భూపాలపల్లి. అక్టోబరు 30, ( వెలుతురు)**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, భూపాలపల్లి మరియు మహదేవ్‌పూర్ ఐ– 1, 2 డివిజన్‌ల ఇరిగేషన్ అధికారులు, వ్యవసాయ శాఖ, జిల్లా వైద్యాధికారి, ఆసుపత్రుల సమన్వయ అధికారి, విద్యుత్, విద్యా, ప్రణాళిక, సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, నదులు–వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాల దృష్ట్యా అత్యవసర చర్యలు, సహాయక చర్యలు, ప్రమాద నివారణ చర్యలపై సూచనలు జారీ చేశారు. జిల్లాలోని వాగులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలు, ప్రమాద సూచన కేంద్రాలపై నిరంతర నిఘా పెట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు చేయాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను వెంటనే రైతులకు, ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర సేవల సిబ్బంది 24ఐ7 అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్, రోడ్లు, త్రాగునీరు, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రానున్న రెండు రోజులు మొంథా తుఫాను ప్రభావంతో భారీవర్షాలు కురిసే అవకాశముండడంతో ప్రజలు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ గారు సూచించారు. ఇంటి నుండి చాలా అవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదు. పొంగుతున్న వాగులు, నదులు, చెరువులను దర్శించడానికి వెళ్లొద్దుచెరువుల బండల పరిరక్షణకు స్థానిక శాఖలు చర్యలు తీసుకోవాలి. రహదారులపై నీరు ప్రవహించే ప్రాంతాల్లో బారికేడింగ్ ఏర్పాటు చేసి రాకపోకలు నియంత్రించాలి. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలు, భవనాలలోని ప్రజలు, విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, విద్య, వైద్య, ప్రణాళిక, వ్యవసాయ, సంక్షేమ శాఖల అధికారులు, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి శాఖ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# కిస్తీ కట్టలేక... ఆటోల అమ్మకం...

**నిజామాబాద్, అక్టోబరు 30, ( వెలుతురు)**



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడంతో మహిళలు బస్సులలో ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఆటోవాలాలు అవస్థలు పడుతున్నారు. మహిళా ప్రయాణికులు లేక ఆటోలు వేలవేల బోతున్నాయి. కేవలం పురుషులు మాత్రమే ఆటోలలో ప్రయాణం చేస్తున్నాడంతో ఆటోవాలాలకు భారీగా గిరాకీ తగ్గింది. గతంలో ఎక్కడ చూసినా ఆటోలల్లో మహిళలు కనిపించేవారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో మహిళలు ప్రయాణం చేసేందుకు ప్రభుత్వ ఆర్టీసీ బస్సుల లో ప్రయాణం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆటోవాలా ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. ఫైనాన్సులలో తెచ్చుకున్న వారు ఫైనాన్స్ కిస్తీలు చెల్లించక ఆటోలను అమ్ముకుంటున్నారు. మరికొందరు కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.ప్రభుత్వం ఆటోవాలాలకు నెలసరిగా పింఛన్ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన అమలు చేయడం లేదు. ఉపాధి దెబ్బ తినడంతో ఆటోవాలాలు అవస్థలు పడుతున్నారు. గులాబీ పార్టీ ప్రభుత్వ హాయంలో రుయ్యు.. రుయ్యున తిరిగే ఆటోల స్పీడుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో బ్రేక్ పడింది. దినమంతా కిటకిటలాడే ఆటో స్టాండ్ లలో ప్రయాణికుల జాడే కనిపించకుండా పోయింది.మహిళలకు ఉచిత ప్రయాణం పేరిట మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తేవడంతో ఆటోవాలాల ఆదాయానికి గండి పడింది. పొద్దంతా అడ్డాలో కూసున్న.. సంపాదన మాత్రం సున్నా గా మారింది. తెలంగాణలో ఆటో రిక్షా కార్మికుల పరిస్థితి ఇలా ఉంటే, ఆంధ్రప్రదేశ్లో మాత్రం అక్కడి ప్రభుత్వం దీపావళి కానుకగా ప్రతి ఆటో రిక్షా కార్మికుడికి 15వేల రూపాయల చొప్పున వారి వారి ఖాతాలో జమ చేస్తున్నట్లు ప్రకటించడం పై ఇక్కడి ఆటో రిక్షా సంఘాల్లో ఆందోళన మొదలైంది.తమ కూడా ఆంధ్రాలో ఇస్తున్నట్లుగా తెలంగాణ ఆటో రిక్షా కార్మికులకు దీపావళి కానుక అందించాలంటూ వారి నుండి డిమాండ్ తెరపైకి వస్తుంది. కాగా, గతంలో ఆటోలు మహిళలతోనే నిండుగా కనిపించేవి. ప్రస్తుతం మహిళా ప్రయాణికులు అందరూ ఆధార్ కార్డుతో ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తుండడం వల్ల ఆటోలలో మహిళల సందడి లేకుండా ఉంది. నిజానికి పల్లె నుండి పట్టణానికి రావాలన్న, పట్టణవాసులు మార్కెట్లో ఏదైనా ఖరీదు చేయాలన్న ఆటోలను మహిళల ఆశ్రయించే పరిస్థితి ఉండేది.దీంతో ఆటోవాలాలు రోజుకు 1000 నుండి 1500 రూపాయల వరకు సంపాదించుకునేవారు. ఆర్టీసీ బస్టాండ్ ల ముందు ఆటో అడ్డాలు ఉండటం వల్ల ప్రయాణికులు దూర ప్రాంతాల నుండి వచ్చిన, సమీపంలో ఉన్న పల్లెలకు వెళ్లాలన్న ఆటోలోనే ప్రయాణం చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సులను మాత్రమే ఆశ్రయిస్తున్నారు. చివరకు పట్టణంలోని మార్కెట్ కు వెళ్లాలన్న బస్సులోనే ప్రయాణం సాగిస్తున్నారు.దీనివల్ల ఆటోవాలాలకు గిరాకీ లేక ఆదాయం పూర్తిగా సన్నగిల్లింది. చదువుకున్న, చదువుకోకపోయినా డ్రైవింగ్ శిక్షణ పొంది ఆటోలను కొనుగోలు చేసి జీవనం సాగించేవారు. నెలసరికిస్తులతో ఆటోలను కొనుగోలు చేసి నడుపుకుంటూ క్రమంగా బాకీ ని తీర్చుకుని అవకాశం వారికి ఉండేది. ఆటో నడవకపోగా, ఆశించినంతగా ఆదాయం సమకూరకపోవడంతో వాహన బాకీ ని తీర్చలేక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.నెలసరి కిస్తూ కట్టలేదని ఫైనాన్స్ యజమానులు ఆటోలను లాకెళ్లే పరిస్థితి దాపురించింది. ఇటు ఆటో లేక, చేతినిండా పని లేక ఇంతకాలం హాయిగా బతికిన ఆటోవాలాల జీవనం దుర్భరంగా మారింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో వేలకొలది ఆటోలు నడుస్తున్నాయి. చాలా కుటుంబాలు ఆటో డ్రైవింగ్ పై ఆధారపడి ఉన్నాయి. ఉచిత ప్రయాణం పేరిట మహిళా ప్రయాణికులకు ప్రభుత్వం సానుకూల ధోరణితో వివరించినప్పటికీ, చర్య ప్రభావం ఆటోవాలాల బ్రతుకులపై పడింది.పొద్దంతా అడ్డాలో కూర్చుండి నిరీక్షించిన కేవలం 200 నుండి 500 వరకు కూడా సంపాదించలేకపోతున్నామని ఆటోవాలాలు ఆందోళన చెందుతున్నారు. పాలకులు ఆటోవాలాల విషయంలో ఆలోచించాల్సిన అవసరం ఉందంటూ మేధావులు పేర్కొంటున్నారు. మహిళలకు లాభం చేసి.. ఆటో రిక్షా వాళ్లకు నష్టం చేయడం ఎంత మటుకు సమంజసం అన్న వాదన సైతం వినిపిస్తోంది. ఆటో రిక్షా వారి జీవనోపాధిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వారికి కూడా తగు న్యాయం చేస్తే బాగుంటుందన్న డిమాండ్ తెరపైకి వస్తుంది.

**అప్పు కట్టలేక ఆటో అమ్ముకున్న**

ఆటో రిక్షాకు గిరాకీ లేక, ఆశించిన విధంగా ఆదాయం రాక అప్పు కట్టేందుకు ఆటో అమ్ముకునే పరిస్థితి దాపురించిందని బాన్సువాడ ఆటో డ్రైవర్ మౌలా ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో అమ్ముకొని జీవనోపాధి కోసం వెతికి పరిస్థితి ఏర్పడిందని వాపోయాడు. ఉచిత ప్రయాణం అమల్లోకి రాకముందు రోజువారీగా 1000 నుండి 1500 రూపాయలు ఆటో నడుపుకుంటూ సంపాదించే వాడినని, ప్రస్తుతం ఆటో నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఆందోళన చెందాడు. పాలకులు ఆటో రిక్షా వారి బతుకులపై కూడా ఆలోచించి వారి మేలు కోసం తక్షణ చర్యలు చేపట్టాలని మౌలా డిమాండ్ చేశారు. తనే కాకుండా అడ్డాలో ఉన్న చాలామంది ఆటో డ్రైవర్ల పరిస్థితి కూడా దయనీయంగా ఉందన్నారు. ప్రతి డ్రైవర్ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ కాలం వెళ్ళదీస్తున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం ఉచిత ప్రయాణం పేరిట పథకాన్ని అమల్లోకి తీసుకు రావడంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని, మహిళలకు లాభం చేకూర్చి పాలకులు ఆటో డ్రైవర్ల బతుకులను దయనీయంగా తయారు చేశారని బాన్సువాడ ఆటో డ్రైవర్ దత్తు ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడ్డ డీజిల్ ఖర్చు పోను 200 కు పైన మిగలడం లేదని వాపోయాడు. 200 రూపాయలతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని దిగులు వ్యక్తం చేశారు.ఆటో డ్రైవర్లకు కూడా ప్రభుత్వం ప్రతినెల పెన్షన్ రూపంలో అందించినట్లయితే ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉంటుందని విజ్ఞప్తి చేశాడు. ఏదేమైపోయినప్పటికీ మహాలక్ష్మి పథకం ఆటో డ్రైవర్ల కలలను కల్లలు చేసింది. పిల్లాపాపలతో హాయిగా సాగిపోతున్న వారి కుటుంబాలను ఆర్థికంగా చిన్న భిన్నం చేసిందని చెప్పవచ్చు.పిల్లలను చదువుపించుకోలేక, వారి బాగోగులు చూడలేక ఆటో డ్రైవర్లు అపసోపాలు పడే పరిస్థితి నెలకొంది. ఆటో రిక్షా అనే సర్వస్వం అని నమ్మిన వారికి పాలకులు తీసుకున్న నిర్ణయం ఆటో వా లాల ఆదాయానికి భారీగా గండి కొట్టిందని చెప్పవచ్చు. ఆటో రిక్షా కార్మికుల విషయంలో ప్రభుత్వం ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న భావన మేధావుల్లో వ్యక్తం అవుతుంది.

# దక్షిణ కొరియా వేదికగా చైనా, అమెరికా నేతల భేటీ

**- జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా సాగింది**

**- 10శాతం టారిఫ్‌లను తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటన**

**న్యూఢిల్లీ,అక్టోబర్30( వెలుతురు):**

అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతోన్న వేళ ఇరు దేశాల అధినేతలు డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ గురువారం భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు అంతర్గతంగా సమావేశమైన వీరు పలు కీలక అంశాలపై చర్చలు జరిపారు. జిన్‌పింగ్‌తో భేటీ అనంతరం ట్రంప్ కీలక ప్రకటన చేశారు. చైనాపై టారిఫ్‌లను 10శాతం మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. జిన్‌పింగ్ తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి దక్షిణకొరియాలోని బూసాన్ నగరంలో గల అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వేదికైంది. విమానాశ్రయంలో వీరిద్దరూ సమావేశమవడంపై కొంతమంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అయితే, షెడ్యూల్ కారణాల వల్లే మీటింగ్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాల్సి వచ్చిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి ట్రంప్ బుధవారమే దక్షిణకొరియా నుంచి వెళ్లిపోవాల్సింది. దానికంటే ముందు నిన్న సాయంత్రం జిన్‌పింగ్‌తో భేటీ అవ్వాలని అమెరికా అధ్యక్షుడు భావించారు. సమయాభావం కారణంగా సమావేశాన్ని గురువారం ఉదయానికి మార్చారు. చివరి నిమిషంలో నిర్ణయం తీసుకోవడంతో.. ఎయిర్‌పోర్టులోనే భేటీకి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం దక్షిణ కొరియా నుంచి ట్రంప్ వెళ్లిపోయారు. ఫెంటనిల్ తయారీలో వాడే



ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20శాతం సుంకాలను 10శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57శాతం నుంచి 47శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరిందని ట్రంప్ వెల్లడించారు. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ ఖనిజాలను ఏడాది పాటు అగ్రరాజ్యానికి ఎగుమతి చేసేలా ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ అరుదైన ఖనిజాల కారణంగానే ఇటీవల ట్రంప్ చైనాపై 100శాతం సుంకాల హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. తాజా డీల్‌తో బీజింగ్‌కు ఊరట లభించినట్లయ్యింది. ఇక చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదరనున్నట్లు ట్రంప్ సంకేతాలిచ్చారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడిపై ట్రంప్ ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్ గొప్ప నేత అని, ఆయనకు 10కి 12 మార్కులు ఇస్తానని అన్నారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం నా అమెరికాతో కలిసి పనిచేసేందుకు చైనా అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తాను చైనాలో పర్యటిస్తానని వెల్లడించారు. ఆ తర్వాత వీలు చూసుకుని జిన్‌పింగ్ కూడా అమెరికాకు వస్తారని అన్నారు.

# భారీ వర్షాలకు నిండుకుండలా ప్రాజెక్టులు

**- పులిచింతల రిజర్వాయర్ కు భారీ వరద నీరు**

**- శ్రీశైలం జలాశయానికి పెరిగిన వరద ఉధృతి**

**గుంటూరు,అక్టోబర్30( వెలుతురు):**

ఆంధప్రదేశ్ లో భారీ వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. పల్నాడు జిల్లాలోని పులిచింతల రిజర్వాయర్ కు భారీ వరద నీరు చేరుకుంది. దీంతో ప్రాజెక్ట్ 9 గేట్లు ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. వరద ఇన్ ఫ్లో 5లక్షల వరుకు చేరే అవకాశం ఉన్నందున ముందుగానే దిగువకు 4.9లక్షల క్యూసెక్కులు నుంచి 5.5 లక్షల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. దీని వలన ప్రకాశం బ్యారేజి నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. లోతట్టు ప్రాంత లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. శ్రీశైలం జలాశయానికి వరద నీరు కొనసాగుతుంది. దీంతో జలాశయం వద్ద సైరన్ మోగించి మృత్యకారులకు హెచ్చరికలను జారీ చేశారు.అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని రజాల గ్రామం దగ్గర శారదా నదికి గండి పడింది. దీంతో ఉధృతంగా ప్రవహిస్తున్న శారద నది అక్కడున్న వందల ఎకరాల్లో ఉన్న పంట భూములను నేలమట్టం చేసింది. శారద నది ఉధృతికి శంకరం దగ్గర 100 ఎకరాలు పంట పొలాలు నీట మునిగాయి. దీంతో హరిజాల గ్రామం పూర్తిగా వరద నీటిలో చిక్కుకున్నది. ప్రకాశం బ్యారేజి వద్ద ప్రస్తుతానికి ఇన్ ఎ÷–లో, ఔట్ ఎ÷–లో 2.74 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ప్రకాశం బ్యారేజి వద్ద సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. వరద ఎ÷–లో 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరే అవకాశం ఉండగా, క్రమంగా వరద తగ్గే అవకాశం ఉంది. లంక గ్రామ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. నదిలో ప్రయాణం, ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం లాంటివి చేయరాదు.




## సంగం బ్యారేజికి తప్పిన ముప్పు: అనిత

**విజయవాడ,అక్టోబర్ 30( వెలుతురు):**

అధికారుల ముందస్తు చర్యలతో నెల్లూరు జిల్లా సంగం బ్యారేజీకి ముప్పు తప్పిందని హోం మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. సంగం బ్యారేజీకి కొట్టుకువచ్చిన 35 టన్నుల భారీ బోటును ఒడ్డుకు చేర్చడంలో అధికారుల పనితీరు ప్రశంసనీయమన్నారు. బ్యారేజీకి ప్రమాదం సంభవించకుండా కలెక్టర్, అధికారులు వెంటనే స్పందించారని తెలిపారు. సంగం బ్యారేజీ బోటు ప్రమాదానికి గురికాకుండా చర్యలు తీసుకున్నారన్నారు. నంద్యాల జిల్లా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటించారు. బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో దెబ్బతిన్న పంటను పరిశీలించారు. కోవెలకుంట్ల మండలం స్వామినగర్, బిజినవేములలో కూలిన మట్టి మి÷–దదెలను పరిశీలించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి.. పునరుద్ధరణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

# క్యాష్ ఫర్ జాబ్... తమిళనాడును కుదిపేస్తున్న స్కామ్




**చెన్నై, అక్టోబర్30( వెలుతురు):**
తమిళనాడు రాష్ట్రంలో రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. అక్కడ అధికార పార్టీకి విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే చుక్కలు చూపిస్తోంది. తాజాగా టీవీకే పార్టీ తమిళనాడు రాష్ట్రంలో చోటు చేసుకున్న కుంభకోణాన్ని బయటపెట్టింది. ఇది ఆ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో చోటుచేసుకుందని టీవీకే ఆరోపించింది. టీవీకే ఆరోపణల ప్రకారం చూసుకుంటే.. తమిళనాడు రాష్ట్రంలోని మునిసిపల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల భర్తీ నిర్వహించారు. ఈ క్రమంలో ఒక్క ఉద్యోగానికి 25 నుంచి 35 లక్షల వరకు లంచాలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇటీవల ఓ మనీలాండరింగ్ కేసు కు సంబంధించిన వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ సోదాలు నిర్వహించింది. తద్వారా ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై తమిళనాడు పోలీస్ శాఖకు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ లేఖ రాసినట్టు తెలుస్తోంది. ఈ ముడుపుల వ్యవహారంలో బలమైన వ్యక్తులు ఉన్నారని ఈడీ అధికారులు అభియోగాలు మోపినట్టు తెలుస్తోంది. తమిళనాడు రాష్ట్రంలోని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, జూనియర్ ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ల పోస్టుల భర్తీకి 2024 లో రిక్రూట్మెంట్ ప్రక్రియ మొదలుపెట్టారు. ఈ ఉద్యోగాలకు తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా 1.12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు నిర్వహించిన తమిళనాడు ప్రభుత్వం 2,538 ని ఎంపిక చేసింది. వీరికి గత ఏడాదిలో ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక పత్రాలు అందజేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరిగాయని కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. ముఖ్యంగా 150 మంది అభ్యర్థులకు ప్రయోజనం కలిగించే విధంగా పరీక్షలలో అక్రమాలకు పాల్పడినట్టు కేంద్ర దర్యాప్తు సంస్థ అభియోగాలలో వెల్లడించింది. ఈ 150 మంది అభ్యర్థుల నుంచి 25 నుంచి 35 లక్షల చొప్పున డబ్బులు తీసుకున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ వ్యవహారం వెనుక అనేక మంది రాజకీయ నాయకులు.. ఇంకా కొన్ని సంస్థలు ఉన్నట్టు ఈడి ఆరోపించింది. ఈ వ్యవహారం పై దర్యాప్తు జరపాలని తమిళనాడు హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్ కు ఈడి లేఖ రాయడం కలకలం కలిగిస్తోంది. ఈ అక్రమాలకు సంబంధించి 232 పేజీలతో ఆధారాలు కూడా. ఈ పరీక్షను అన్నా యూనివర్సిటీ నిర్వహించింది. ఆ విశ్వవిద్యాలయంపై కూడా దర్యాప్తు చేపట్టాలని ఈడీ కోరినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని తమిళనాడు మీడియా పట్టించుకోకపోయినప్పటికీ.. టీవీకే పార్టీ అధినేత ప్రధానంగా దృష్టి సారించారు. ఇటీవల కరూర్ ప్రాంతంలో జరిగిన తొక్కిసలాట ఘటన విషయంలో విజయ్ ని అధికార డిఎంకె టార్గెట్ చేసింది. అనుకూల మీడియాలో అడ్డగోలుగా కథనాలను ప్రసారం చేయించింది. అయితే అనువైన సమయం కోసం ఎదురుచూస్తున్న విజయ్.. అదును చూసి డీఎంకేను దెబ్బ కొట్టారు.. అంతేకాదు తమిళనాడు రాష్ట్రంలో ఉద్యమాలు నిర్వహించడానికి కసరత్తులు కూడా చేస్తున్నారు.

# ముందుకొస్తున్న సముద్రం... మత్స్యకారుల పూజలు..



**బాపట్ల, కాకినాడ, అక్టోబర్30( వెలుతురు):**
ఏపీలో మొంథా తుఫాను వణుకు పుట్టించింది. రాష్ట్రం చిగురుటాకుల వణికిపోయింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ పెను విపత్తు తీరం వైపు వచ్చే క్రమంలో ప్రతిక్షణం భయం భయమే. ఒకవైపు భారీ ఈదురుగాలులు, ఇంకోవైపు కుండపోతగా వానలు, మరోవైపు ఉవ్వెత్తున ఎగసిపడే రాకాసి అలలు ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేశాయి. శ్రీకాకుళం జిల్లా డుంకూరు నుంచి తిరుపతి జిల్లా తడ వరకు బంగాళాఖాతంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ఎక్కడికక్కడే సముద్రం ముందుకు చొచ్చుకు వచ్చింది. దీంతో తీర ప్రాంతంలో భయాందోళనలు వ్యక్తం అయ్యాయి. చాలాచోట్ల తీరం కోతకు గురైంది. ప్రతి జిల్లాలోని తీరప్రాంతాల్లో ఇది స్పష్టంగా కనిపించిందితుఫాన్ దాటికి కాకినాడ తీరం అల్లకల్లోలంగా మారింది. తాళ్లరేవు నుంచి తొండంగి వరకు తీరం వెంబడి అలలు ఉవ్విత్తిన ఎగసిపడ్డాయి. తుఫాన్ తీరానికి సమీపిస్తున్న కొద్ది సముద్రంలో అలజడి మరింత తీవ్రంగా మారింది. తీరం వెంబడి రాళ్లగుట్టలు ఉన్నచోట ఎనిమిది నుంచి పది అడుగుల ఎత్తులో అలలు ఎగసిపడ్డాయి. శ్రీకాకుళం జిల్లాలోని తీర ప్రాంతంలో సైతం ఇదే పరిస్థితి ఎదురయింది. విశాఖ లో సైతం అలలు ఎగసి పడటం, సముద్రం ముందుకు రావడం వంటి కారణాలతో బీచ్ ప్రాంతాలను పూర్తిగా మూసివేశారు. అటువైపుగా పర్యాటకులను రానివ్వలేదు. ఉప్పాడ మత్స్యకారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అర కిలోమీటర్ దూరం వరకు సముద్రపు అలల శబ్దం వినిపించడంతో మత్స్యకారులు భయపడిపోయారు. గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదని చెబుతున్నారు. తీరానికి చెంతనే ఉన్న వందలాది గ్రామాలకు సముద్రపు నీరు చుట్టుముట్టింది. దీంతో అధికారులు మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలించారు. సముద్రుడి ఉగ్రరూపం చూసి తీర ప్రాంతం వెంబడి మత్స్యకారులు(తీవ్ర ఆందోళనకు గురయ్యారు. గతంలో చాలా విపత్తులు చూసామని.. ఏకకాలంలో వాన, ఈదురు గాలులు ఉన్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. అయితే ముందస్తు హెచ్చరికల విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా, తీవ్ర తుఫాన్ గా మారిన క్రమంలో ఏపీ ప్రభుత్వం ముందుగానే అప్రమత్తం అయ్యింది. ముందుగా మత్స్యకారులను అప్రమత్తం చేసింది. అప్పటికే చేపల వేటకు వెళ్లిన వారిని తీరానికి చేర్చింది. అయితే సముద్రం అల్లకల్లోలంగా మారిన క్రమంలో ఎక్కడికక్కడే మత్స్యకార మహిళలు పూజలు చేశారు. సముద్రుడు ఉగ్రరూపం నుంచి శాంతించాలని కోరుతూ తీరం వద్దకు వచ్చి మహిళలు పూజలు చేయడం కనిపించింది. అయితే తీరానికి తుఫాన్ తాకిన క్రమంలో 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. మొత్తానికైతే సముద్రుడి ఉగ్రరూపంతో మత్స్యకారులు బెంబేలెత్తిపోయారు.

# కలకలం రేపుతున్న ఆపరేషన్ షట్టర్

**జైపూర్, అక్టోబర్30( వెలుతురు):**
ఆపరేషన్ షట్టర్ డౌన్ లో రాజస్థాన్ లోని ఝలావర్ పోలీసులు కేంద్ర ప్రభుత్వ సామాజిక పథకాలకు సంబంధించిన దేశంలోనే అతిపెద్ద సైబర్ మోసాన్ని బయటపెట్టారు. ఈ ముఠాలోని ఎనిమిది మంది సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్ లోని కలెక్టర్లతో సహా దేశవ్యాప్తంగా 1,256 మంది అధికారుల లాగిన్ ఐడీలు, పాస్వర్డ్లను తస్కరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యక్తులు 4,00,000 అద్దె ఖాతాలకు కోట్ల రూపాయలను బదిలీ చేశారు. జైపూర్లోని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన రాష్ట్ర నోడల్ కార్యాలయంలో ఆపరేటర్గా ఉన్న మహ్మద్ లాయక్ ఈ మోసానికి ప్రధాన సూత్రధారిగా పోలీసులు నిర్ధారించారు. ఈ కుంభకోణంలో కేంద్ర ప్రభుత్వ అధికారి కూడా ప్రమేయం ఉందని పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే 11,000 ఖాతాలను స్తంభింపజేశారు. 10,000 ఖాతాలపై దర్యాప్తు జరుగుతోంది. ఇందుకు సంబంధించి ఝలావర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ కుమార్ మీడియాకు వివరాలను వెల్లడించారు. “ఇప్పటివరకు ఎంత డబ్బు బదిలీ చేశారన్న దానిపై దర్యాప్తు జరుగుతోంది” అని అన్నారు. నాగౌర్, టోంక్, బార్మెర్, ఝలావర్, భరత్పూర్, ఫలోడి కలెక్టర్ల లాగిన్ ఐడీలు, పాస్వర్డ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ముఠా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, జనధార్ పోర్టల్, సామాజిక భద్రతా పెన్షన్ పోర్టల్, విపత్తు నిర్వహణ శాఖ కు చెందిన %ణవీ×ూ% పోర్టల్ ద్వారా మోసానికి పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. మోసగాళ్ల నెట్వర్క్ రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, అస్సాం, మణిపూర్ సహా అన్ని రాష్ట్రాలలో విస్తరించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్టు చేసిన నిందితుల్లో రాష్ట్ర నోడల్ కార్యాలయంలోని ఆపరేటర్ల నుండి కలెక్టరేట్లో పనిచేసే ఉద్యోగుల వరకు ఉన్నారని పోలీసు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి లక్షలాది మంది లబ్ధిదారులకు చెందిన అనుమానాస్పద డేటా, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల పోర్టల్లు, వెబ్సైట్లను హ్యాక్ చేయడం ద్వారా లక్షలాది రూపాయలను మోసం చేశారు. ప్రధానమంత్రి సమ్మాన్ నిధి పథకం కింద వారు అనేక మంది నకిలీ రైతులను కూడా సృష్టించారు. ఫలితంగా కోట్లాది రూపాయలను కొట్టగొట్టారు. నిందితుడు మొహమ్మద్ లాయక్ జైపూర్లోని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన




రాష్ట్ర నోడల్ కార్యాలయంలో ఆపరేటర్గా పనిచేస్తున్నాడు. ఇదే అదునుగా రాష్ట్ర నోడల్ కార్యాలయం అధికారిక ఐడీలను యాక్సెస్ చేయగలిగాడని పోలీసు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులు అధికారం కోసం ఉపయోగించడానికి రాష్ట్రంలోని జిల్లా నోడల్ కార్యాలయాల నుండి ఐడీలను సృష్టించడానికి అతను దీనిని ఉపయోగించాడు. నిందితులు కార్యాలయ సమయాల్లో, సాధారణంగా రాత్రి సమయంలో చట్టవిరుద్ధంగా సృష్టించిన లను యాక్టివేట్ చేసి, ఉదయం కార్యాలయం నుండి తిరిగి వచ్చిన తర్వాత వాటిని డీయాక్టివేట్ చేసేవాడని ఎస్పీ తెలిపారు. ఏజెంట్లు క్లోజ్డ్ ఖాతాల డేటాను సేకరించి నోడల్ అధికారి లాగిన్ ద్వారా పంపారని ఎస్పీ తెలిపారు. గ్రామాల్లో, ముఠా ఏజెంట్లు అనర్హులైన లబ్ధిదారుల డేటాను సేకరించారు. వారి రిజిస్ట్రేషన్ ల్యాండ్ సీడింగ్ లేదా ఇతర కారణాల వల్ల నిష్క్రియంగా ఉంది. వారు పథకాలకు మళ్లీ జోడించే నెపంతో ఆధార్, ఖాతా వివరాలను ప్రధాన ఏజెంట్కు ఇచ్చారు. తర్వాత వారు ఎక్సెల్ షీట్ను రాష్ట్ర నోడల్ కార్యాలయ ఆపరేటర్కు పంపారు. రాష్ట్ర నోడల్ కార్యాలయ ఆపరేటర్ జిల్లా నోడల్ అధికారుల కొత్త ఐడీలను సృష్టించారు. రాష్ట్ర నోడల్ కార్యాలయ ఆపరేటర్, మోసగాళు ృ ని దాటవేయడం ద్వారా అనర్హులైన వ్యక్తులను కిసాన్ సమ్మాన్ నిధికి అనధికారికంగా అర్హులుగా చేయడానికి కార్యాలయ సమయాల్లో, రాత్రి సమయం తర్వాత లాగిన్ లను ఉపయోగించారు. తరువాత, నిందితులు లాగిన్ లను తొలగించారని పోలీసులు తెలిపారు. మొహమ్మద్ లాయక్: అతను జైపూర్లోని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన రాష్ట్ర నోడల్ కార్యాలయంలో ఆపరేటర్గా ఉన్నాడు. రాష్ట్ర నోడల్ కార్యాలయం అధికారిక ఐడీ లను యాక్సెస్ చేయగలిగాడు. ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా ఉపయోగించడానికి రాష్ట్ర, జిల్లా నోడల్ కార్యాలయాల లను సృష్టించడానికి అతను దీనిని ఉపయోగించాడు. ఇదిలావుంటే, మరో నిందితుడు షఫీక్ ఝలావర్కు పారిపోయాడు. ప్రస్తుతం అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. మొహమ్మద్ షాహిద్: భరత్పూర్ నివాసి అయిన షాహిద్, ల్యాండ్ డెవలప్మెంట్ బ్యాంక్లో పనిచేస్తున్నప్పుడు, అనర్హుల మోసపూరిత యాక్టివేషన్లో లాయక్తో పరిచయం ఏర్పడింది. నైరుతి ఢిల్లీ నివాసి సుభాష్ కశ్యప్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాబ్లోని జలంధర్ నివాసి రోహిత్ కుమార్.. వివిధ రాష్ట్రాల రైతు పథకాల క్లోన్ వెబ్సైట్లను సృష్టించడం వెనుక ప్రధాన సూత్రధారి. పంజాబ్లోని జలంధర్ నివాసి సందీప్ శర్మ క్లోన్ వెబ్సైట్ డెవలపర్ జలంధర్ నుండి అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్లోని జలంధర్ నివాసి సునత్ శర్మ, రాజస్థాన్ ఖరా జిల్లా ఫలోడి నివాసి రమేష్ చంద్ర, రాజస్థాన్లోని దోస్సా జిల్లా నివాసి భాగ్చంద్ సైనీని పోలీసులు అరెస్ట్ చేసి కూపీ లాగుతున్నారు.

# ప్రతి డివిజన్ కో మంత్రి.. సర్వశక్తులు ఒడ్డుతున్న కాంగ్రెస్..

**హైదరాబాద్, అక్టోబర్30( వెలుతురు):**
జూబ్లీహిల్స్ను హస్తగతం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతోపాటు కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ ఇతర సీనియర్లలను నియోజకవర్గంలో మోహరించింది. హైదరాబాద్లో జరిగే రెండో ఉప ఎన్నికలోనూ పాగా వేయాలనే పట్టుదలతో ఉన్న కాంగ్రెస్ ప్రచారంలో వేగం పెంచింది. ఇప్పటికే కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలుపొందిన కాంగ్రెస్, ఇప్పుడు జూబ్లీహిల్స్ సైతం తన ఖాతాలో వేసుకునేందుకు పావులు కదుపుతున్నది. ఇందుకు గల్లీకో లీడర్, డివిజన్కో ఇద్దరు మంత్రులకు ఇన్చార్జులుగా నియమించింది. 200 ఓట్లకు ఒకరికి బాధ్యతల ను కూడా అప్పగించింది. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కూడా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్లు, బైక్ ర్యాలీలలో సీఎం పాల్గొననున్నారు. అధ్యక్షు డు మహేశ్కుమార్గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షినటరాజన్, పార్టీ సీని యర్లు జూబ్లీహిల్స్పై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇంటలిజెన్స్తో పాటు ప్రైవేట్గా కూడా ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహిస్తున్నారు. ఏమైనా లోపాలుంటే సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారు. పోలింగ్ రోజు వరకు అప్రమత్తంగా ఉండి.. పార్టీ అభ్యర్థి నవీన్యాదవ్ను గెలిపించుకునేందుకు బీసీ వాదాన్ని కూడా ముందుకు తీసు కొస్తున్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలవారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓటర్లుగా ఉన్న పాలమూరు జిల్లా వాసులతో సమావేశం నిర్వహించి కాంగ్రెస్కు అండగా ఉండాలని కోరారు.



**ప్రచార అస్త్రాలుగా అభివృద్ధి, సంక్షేమం..**
జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి నెల రోజుల క్రితమే ముగ్గురు మంత్రులు తుమ్మ ల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిని ఇన్చార్జులుగా నియమించిన విషయం తెలిసిందే. వీరు నియో జకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నా రు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సం క్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నా రు. ఇప్పుడు ఏకంగా ప్రతి డివిజన్కు ఇద్దరు మంత్రులను ఇన్చార్జులుగా నియమించడం ఆసక్తిగా మారింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్యాదవ్పై ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న ఆరోపణలను పార్టీ నేతలు తిప్పికొడుతూ ప్రచారహోరును పెంచుతున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత విషయంలో గులాబీ నేతలు సెంటిమెంట్ను ప్లే చేస్తుండగా, అందుకు ధీటుగా కాంగ్రెస్ నేత లు బీసీ కార్డును తెరపైకి తీసుకొస్తున్నారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి గోపీనాథ్ నియోజకవర్గానికి చేసిందేమిలేదనే విమర్శలతో ముందుకెళ్లుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నందున, ఇక్కడ పార్టీ అభ్యర్థి గెలిస్తే అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని, ఆయా డివిజన్లలో పేరుకుపోయిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నారు.

**డివిజన్లవారీగా మంత్రులు**
నియోజకవర్గ బాధ్యతలను ఇప్పటికే ముగ్గురు మంత్రులకు అప్పజెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇక ఒక్కో డివిజన్కు ఇద్దరు మంత్రులను ఇన్చార్జులుగా నియమించింది. రహమత్నగర్కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బోరబండకు సీతక్క, ఎంపీ మల్లు రవి, వెంగల్రావునగర్కు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సోమాజిగూడకు శ్రీధర్బాబు, అడ్లూరి లక్ష్మణ్కుమార్, షేక్ పేటకు కొండా సురేఖ, వివేక్, ఎర్రగడ్డకు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, యూసుఫ్గూడకు ఉత్తమ్కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్కు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ సీనియర్లు, ఇతర నాయకులు నియోజకవర్గవ్యాప్తంగా పాదయాత్రలు, ఇంటింటి ప్రచారాలు చేస్తూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్నారు.

# గరం...గరంగా పాలకుర్తి పాలిటిక్స్

**వరంగల్, అక్టోబర్30( వెలుతురు):**
ఎర్రబెల్లిని ఓడించి యశస్వినీరెడ్డికి పట్టం కట్టిన పాలకుర్తి. పాలకుర్తి నియోజకవర్గంలో పాలిటిక్స్ గరం గరంగా నడుస్తున్నాయి. అధికార.. ప్రతిపక్ష పార్టీల మధ్య జరగాల్సిన పోటాపోటీ రాజకీయాలు స్వంత పార్టీలోనే జరుగుతున్నాయి. అధికార హస్తం పార్టీ నేతలు రెండుగా చీలిపోయి ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నారట. దీంతో నియోజకవర్గ అభివృద్ధి మాట పట్టించుకునేవారు లేరని స్థానికులు అసంతృప్తికి లోనవుతున్నారట. ఎర్రబెల్లిని ఓడించి యశస్వినీ రెడ్డికి పట్టం కట్టిన పాలకుర్తి ప్రజలు సంక్షేమం, అభివృద్ధిలో నియోజకవర్గం దూసుకుపోతుందని భావించారట. ఝాన్సీ రెడ్డి, యశస్వినీ రెడ్డిలు రాజకీయాలకు కొత్త కావడంతో... పార్టీలను పక్కనబెట్టి డెవలప్మెంట్ పైనే దృష్టి పెడతారని ఆశపడ్డారట. అయితే ఇప్పుడు తమ పరిస్తితి పెనం నుండి పొయ్యిలో పడినట్లు అయిందని ఆవేదన చెందుతున్నారట. సొంత నిధులు ఖర్చు పెట్టైనా అభివృద్ధి చేస్తామని హామీలు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఆమె అత్త ఝాన్సీ రెడ్డి నియోజకవర్గాన్ని మోడల్ గా నిలుపుతామని ప్రజలకు ప్రామిస్ చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పనులను సొంత నిధులు ఖర్చు పెట్టైనా పూర్తి చేస్తామని హామీల వర్షం గుప్పించారు. కానీ నెలల గడుస్తున్న కొద్దీ.. మాటలు తప్ప, అభివృద్ధి బాటలు కనిపించట్లేదట. నియోజకవర్గంలో అభివృద్ధి జరగట్లేదని స్వంత పార్టీ నేతలే తమ ఎమ్మెల్యేపై మండిపడుతున్నారట. కొంతమంది నేతలు ధైర్యం చేసి ప్రజలకిచ్చిన హామీల మాటేమిటని అడిగితే..



.పార్టీ నుండి వెలివేసి..మాతో పెట్టుకుంటే నిప్పుతో పెట్టుకున్నట్లే అంటూ సినిమా డైలాగులు చెప్తున్నారట. గోదాంల నిర్మాణాలపై కాంగ్రెస్ నాయుకుడు ఫైర్. ప్రస్తుతం దేవరుప్పుల మండలంలో 5కోట్ల రూపాయల నిధులతో గోదాంల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. అయితే ప్రభుత్వ స్థలంలో అందరికీ అందుబాటులో ఉండే చోట నిర్మాణాలు చేయాలని సొంత పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. దేవరుప్పుల శివారులోని మనుపాడ్ గుట్టలను తొలగించి గోదాంల నిర్మాణం చేయాలని కొందరు నేతలు సూచిస్తున్నారు. అయితే పర్యావరణానికి హాని జరిగేలా.. గుట్టలను తొలగిస్తే ఊరుకోబోమని కాంగ్రెస్ నాయకుడు పెద్ది కృష్ణమూర్తి ఫైర్ అయ్యారు. దీంతో ఆగ్రహానికి లోనైన ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి మరో సినిమా డైలాగ్ అందుకున్నారట. గ్రామస్తుల నిర్ణయం చెప్తే.. ఈ డైలాగులు ఏంటని కాంగ్రెస్ శ్రేణులే విస్తుపోయారట. ప్రజల సంక్షేమం కోసం మాట్లాడితే వార్నింగ్ ఇస్తున్న అత్త ఝాన్సీ. గత కొద్ది నెలలుగా నియోజకవర్గ వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని నిరసనలు జరుగుతున్నాయి. ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్రూంలు పంపిణీ చేయాలని కొంతమంది హస్తం పార్టీ నేతలే పట్టుబడుతున్నారట. ఇలా ప్రజల సంక్షేమం కోసం ఆలోచించి మాట్లాడితే... తమతో పెట్టుకుంటే నిప్పుతో పెట్టుకున్నట్లే అంటూ తమ చుట్టూ ఉన్న నేతలకే వార్నింగ్స్ ఇస్తున్నారట ఎమ్మెల్యే అత్త ఝాన్సీ రెడ్డి. అభివృద్ధిని పట్టించుకోవడం లేదని స్థానికుల అసంతృప్తి. నియోజకవర్గంలోని గ్రామాలలో రోడ్ల పరిస్తితి అధ్వాన్నంగా మారి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఖమ్మం హైవే ప్రతిరోజూ ప్రమాదాలతో రక్తసిక్తంగా మారుతోంది. సమస్యలు చెప్పుకుంటే మళ్ళీ సినిమా డైలాగులు చెప్తారేమోనని సైలెంట్ గా బాధలు అనుభవిస్తున్నారట నియోజకవర్గ ప్రజలు. రాజకీయాలకు అతీతంగా తమ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఎర్రబెల్లిని ఓడిస్తే.. అభివృద్ధి సంక్షేమం దేవుడెరుగు సమస్యలు చెప్పుకుంటే రీసౌండ్ లో డైలాగులు వినాల్సి వస్తుందని లోలోపలే మదన పడుతున్నారట పాలకుర్తి ప్రజలు. అభివృద్ధిలో దూసుకెళ్తామనుకున్న ఆశలన్నీ అడియాసలైనట్లేనని తలలు పట్టుకుంటున్నారట నాయకులు.

వెలుతురు

cinema

# నా నటనకు రిటైర్మెంట్ లేదు

## మాస్ జాతర హీరో రవితేజ

'మాస్ జాతర' అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవని రవితేజ తెలిపారు. ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగిందన్నారు. జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం.




# రాజమౌళి-మహేశ్‌బాబు కాంబో

## కొత్త సినిమా విశేషాలు పంచుకోనున్న రాజమౌళి



రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందుతోంది. ఇంకా పేరు పెట్టని ఈ సినిమాని 'ఎస్-ఎస్ఎంబి 29' అని, గ్లోబ్ ట్రాట్టింగ్ మూవీ అని రకరకాలుగా పిలుస్తున్నారు. అయితే ఈ సినిమాకి సంబంధించిన పూజా కార్యక్రమం చాలా సీక్రెట్‌గా జరిపించారు రాజమౌళి. హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్లో చాలా సీక్రెట్‌గా, పగడ్బందీగా ఓపెనింగ్ జరిపి, ఆ రోజు నుంచే కొన్నాళ్లపాటు షూటింగ్ కూడా జరిపారు. ఇటీవలే ఒక షెడ్యూల్ షూటింగ్ కోసం కెన్యా కూడా వెళ్లి వచ్చింది టీమ్. ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, నవంబర్ 15వ తేదీన హైదరాబాద్ వేదికగా ఈ సినిమాకి సంబంధించి ఒక పెద్ద ఈవెంట్ నిర్వహిస్తున్నారు రాజమౌళి. కే.ఎల్. నారాయణ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమా ఈవెంట్‌లో సినిమాకి సంబంధించిన అనేక విషయాలను వెల్లడించే అవకాశం కనిపిస్తోంది. సాధారణంగా రాజమౌళి తన సినిమాలు మొదలుపెట్టేముందు ఒక ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, సినిమా ఎలా ఉంటుందో ముందే చెప్పేస్తారు. కానీ ఈ సినిమా విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వస్తున్నారు. అయితే ఇప్పుడు ఈవెంట్ నిర్వహించడానికి కారణం ఏంటి అనేది మాత్రం తెలియదు. నవంబర్ 15వ తేదీ జరగాల్సిన ఈవెంట్‌కు సంబంధించి ఇప్పటినుంచే ఏర్పాట్లు ప్రారంభమైనట్లుగా సమాచారం.

# మహాకాళిగా కన్నడనటి భూమిశెట్టి

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) అక్టోబర్ 30:** తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి'. ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమి శెట్టి నటించనున్నట్లు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు. ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్లు సమాచారం . ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా (ం÷ఖబరజా। ఐరజీనినిజీ) శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ (ఖసజీబజీనిబిర ÷ఎజీసపజీ) మాట్లాడుతూ.. మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం అని అన్నారు. ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య, కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.




# మార్చి 19న లాక్ చేసిన టాక్సిస్

'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ నటుడు యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్ యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీన్ఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా విడుదల తేదీ వాయిదా పడబోతున్నట్లు వార్తలు వచ్చాయి. సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుండడంతో విడుదల తేదీ మారబోతుందని టాక్ వచ్చింది. అయితే ఈ రూమర్స్‌పై తాజాగా చిత్రబృందం స్పందిస్తూ.. విడుదల తేదీలో మార్పులు లేవంటూ ప్రకటించింది. చెప్పిన డేట్ ప్రకారమే వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కియార అద్వానీ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ కీలక పాత్రల్లో నటిస్తున్నాడు. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.




# వశిష్ట మల్లిడిని లైన్‌లో పెట్టిన రవితేజ



టాలీవుడ్ యాక్టర్ రవితేజ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులు, ఫాలోవర్లను ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. భాను బోగవరపు డైరెక్షన్‌లో నటిస్తోన్న మాస్ జాతర నేటినుంచి థియేటర్లలో సందడి చేయనుంది. రవితేజ మరోవైపు కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఆర్‌టీ 76 ప్రాజెక్ట్‌ను కూడా లైన్‌లో పెట్టగా.. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఈ రెండు సినిమాలు విడుదల కాకముందే రవితేజకు సంబంధించిన మరో ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. రవితేజ ఈ సారి చిరంజీవి డైరెక్టర్‌తో సినిమా చేసే ఎ÷-లాన్ చేస్తున్నాడన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్గా మారింది. ఇంతకీ అతడెవరనే కదా మీ డౌటు. బింబిసారతో సూపర్ హిట్ అందుకుని ప్రస్తుతం చిరంజీవితో విశ్వంభర తెరకెక్కిస్తున్న వశిష్ఠ మల్లిడి. ఈ టాలెంటెడ్ డైరెక్టర్ ఇటీవలే రవితేజకు ఓ ఐడియా చెప్పాడని వార్తలు వస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ క్రేజీ కాంబోలో సినిమా ఒకే అవుతుందా..? అనేది ఆసక్తి నెలకొంది. ఇదిలా ఉంటే ఇప్పటికే రవితేజ, నవీన్ పొలిశెట్టి కాంబోలో సినిమా వస్తుందని.. పాపులర్ రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ ఈ ఇద్దరి కోసం ఓ కథ రెడీ చేశాడని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. మరి వశిష్ఠ డైరెక్ట్ చేయబోయేది ఈ ప్రాజెక్ట్‌నేనా..? లేదంటే సెఫరేట్ సినిమా ఉండబోతుందా..? అనేది తెలియాల్సి ఉంది.




# వెండితెరపై మోహన్ లాల్ కూతురు.. పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం

మలయాళ మెగాస్టార్ మోహన్‌లాల్ కుమార్తె విస్మయ మోహన్‌లాల్ , త్వరలో నటిగా వెండితెరపై అరంగేట్రం చేయనున్న విషయం తెలిసిందే. 'తుడక్కమ్' అనే సినిమాతో విస్మయ పరిచయం కాబోతుండగా.. ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో కొచ్చిలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. కొచ్చిలోని క్రౌన్ ప్లాజాలో జరిగిన ఈ వేడుకలో ముఖ్య అతిథిగా మోహన్‌లాల్‌తో పాటు, ఆయన సతీమణి సుచిత్ర, కుమారుడు ప్రణవ్ మోహన్‌లాల్ సహా చిత్ర బృందం పాల్గొంది. ఈ చిత్రానికి '2018' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాతో గుర్తింపు పొందిన దర్శకుడు జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వం వహిస్తుండగా.. మోహన్‌లాల్‌కు అత్యంత ఆప్తులైన ఆంటోనీ పెరుంబావూర్ నేతృత్వంలోని ఆశీర్వాద్ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశీష్ ఆంటోనీ కూడా కీలక పాత్ర పోషించబోతున్నాడు. ఈ సినిమా పూజా కార్యక్రమం అనంతరం మోహన్‌లాల్ మాట్లాడుతూ తన జీవితంలో ప్రతిదీ ఒక 'విస్మయం' (ఆశ్చర్యం)గా భావించే తాను.. తన కుమార్తెను కూడా అదే పేరుతో పిలుచుకుంటానని తెలిపారు. తన పిల్లలు ఇద్దరూ (ప్రణవ్, విస్మయ) సినీ పరిశ్రమలోకి వస్తారని తాను ఎప్పుడూ ఊహించలేదని, ఇది ప్రేక్షకులే ఇచ్చిన ప్రేమ, ఆశీర్వాదం అని లల్లెట్టన్ పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు జూడ్ ఆంథోనీ జోసెఫ్ మాట్లాడుతూ.. 'తుడక్కమ్' అంటే 'ప్రారంభం' అని. ఇది ఒక సాధారణ కుటుంబ చిత్రం అని జూడ్ తెలిపాడు.




# నేడు బాహుబలి: ది ఎపిక్ విడుదల

## బాహుబలి-3పై ప్రేక్షకుల్లో ఉత్కంఠ

తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన 'బాహుబలి: ది బిగినింగ్' , 'బాహుబలి: ది కన్‌క్లూజన్ సినిమాలు ఇప్పుడు ఒకే వెర్షన్‌గా 'బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' టైటిల్‌తో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన ప్రీమియర్స్ గురువారం రాత్రి నుంచే ప్రారంభం కానుండగా, అన్ని ఫార్మాట్లలో సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. కొద్ది రోజులుగా ' బాహుబలి: ది ఎపిక్ వెర్షన్' చివర్లో బాహుబలి 3 పై ప్రకటన ఉంటుందంటూ ప్రచారం జోరుగా సాగింది. అయితే, నిర్మాత శోభు యార్లగడ్డ ఇప్పటికే ఈ రూమర్లపై క్లారిటీ ఇచ్చారు. బాహుబలి 3 ప్రాజెక్ట్ గురించి ఇంకా చాలా వర్క్ చేయాల్సి ఉందని, ప్రస్తుత ఎడిట్‌లో అలాంటి ఎలాంటి ప్రకటన లేదని ఆయన స్పష్టం చేశారు. బాహుబలి 3 ప్రస్తావన లేకపోయినా, ఓ సర్ప్రైజ్ మాత్రం ఉండవచ్చని శోభు ఇటీవలే సూచించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. అదేంటో తెలుసుకోవడానికి అందరూ ఎదురు చూస్తుండగా, ఇప్పుడు రాజమౌళి పరోక్షంగా దానిపై క్లారిటీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. 'బాహుబలి: ది ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలైన రాజమౌళి, ప్రభాస్, రానా చిట్‌చాట్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గంటకుపైగా నిడివి గల ఈ వీడియోలో సినిమా వెనుక జరిగిన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బాహుబలి: ది ఎపిక్'లో అవంతిక లవ్ స్టోరీ, కొన్ని పాటలు, కొన్ని సన్నివేశాలు కటింగ్‌లో తొలగించాం. కథాంశాన్ని మరింత సూటిగా చూపించడానికే ఈ నిర్ణయం తీసుకున్నాం అని తెలిపారు. అలాగే, అందరూ బాహుబలి 3 వస్తుందని అనుకుంటున్నారని ప్రస్తావిస్తూ, అది కాదు అని స్పష్టంచేశారు. కానీ, ఒక స్పెషల్ సర్ప్రైజ్‌ను మాత్రం కన్ఫర్మ్ చేశారు. రాజమౌళి వెల్లడించిన ప్రకారం, బాహుబలి ఎపిక్ వెర్షన్ ఇంటర్వెల్‌లో 3డి యానిమేషన్ టీజర్ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ టీజర్ ద్వారా బాహుబలి యూనివర్స్ కొనసాగనుందని చెప్పారు. ఈ యానిమేషన్ సీక్వెన్స్ దర్శకుడు ఇషాన్ శుక్లా రూపొందించినట్లు ఆయన వెల్లడించారు.

# నేటినుంచి రేడియాలజిస్టుల మహాసభ

## గీతం వర్సిటీ వేదికగా మూడురోజుల సభలు

**విశాఖపట్నం,అక్టోబర్30( వెలుతురు):**

గీతం మెడికల్ కాలేజ్ ఆడిటోరియం వేదిక గా ఈ నెల అక్టోబర్ 31, నవంబర్ 1, 2 తేదీలలో రాష్ట్ర రేడియాలజిస్టుల వార్షిక మహాసభ జరుగనుందని ఎపిఐఆర్ఐఏ అధ్యక్షుడు డాక్టర్ వి. సురేష్ (డాల్ఫిన్ డయాగ్నస్టిక్స్) తెలిపారు. గురువారం ఉదయం విశాఖపట్నంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ మహాసభలను పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ , రేడియాలజిస్టు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సంయుక్తంగా ప్రారంభిస్తారని గీతం ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ గీతాంజలి బాట్ మానాభనే, ఎన్ఆర్ఐ రేడియాలజిస్టు డాక్టర్ ముక్కమాల అప్పారావు, నేషనల్ ఐఆర్ఐఏ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి. మోహన్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. సదస్సు మొదటి రోజు, అక్టోబర్ 31న, ఫీటల్ రేడియాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నామని రాష్ట్రంలో తొలిసారిగా సిమ్యులేషన్ పద్ధతిలో భ్రూణ దశలోని శిశువుపై ఇమేజింగ్ ఆధారిత ఇంటర్వెన్షన్ విధానాలైన అమ్నియోసెంటీసిస్, షంట్ ప్లేస్‌మెంట్‌లను ప్రత్యక్షంగా ప్రదర్శించనున్నామని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు తమిళనాడుకు చెందిన డాక్టర్ భావహరణ్, మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శిల్పా సతర్కర్, బెంగళూరుకు చెందిన డాక్టర్ కృష్ణ ప్రధాన ఫ్యాకల్టీగా వ్యవహరించ



నున్నారని తెలిపారు. రెండవ ,మూడవ రోజుల్లో వైద్య ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు శాస్త్రీయ పత్రాల ప్రదర్శనలు జరుగనున్నాయి. ఈసారి రికార్డు స్థాయిలో 160 రేడియాలజీ పరిశోధనా పత్రాలు సమర్పించబడ్డాయి. వీటిలో ఉత్తమ 12 పత్రాలను వేదికపై ప్రదర్శించి, అత్యుత్తమ మూడు పత్రాలకు పురస్కారాలు అందజేయనున్నామని అన్నారు. ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర స్థాయి రేడియాలజీ క్విజ్ నిర్వహించనున్నారు. దీనిని ఎయిమ్స్ న్యూ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రాజుశర్మ నిర్వహించనున్నారు. ఆయనే ఈ సంవత్సరపు ప్రతిష్ఠాత్మకమైన 'కాకర్ల సుబ్బారావు ఉపన్యాసం'ను కూడా ఇవ్వనున్నారని అదేవిధంగా తిరుపతికి చెందిన ఎస్.వి.ఐ.ఎం.ఎస్. ప్రొఫెసర్ ఆఫ్ రేడియాలజీ డాక్టర్ ఎ. వై. లక్ష్మి కి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేయనున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 750 మంది రేడియాలజిస్టులు, వైద్య అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల రేడియాలజీ విభాగాధిపతులు హాజరై వైద్య విద్యలో కొత్త ధోరణులు, టెక్నాలజీ వినియోగం, రేడియాలజీ శిక్షణలో అభివృద్ధి మార్గాలు వంటి అంశాలపై చర్చించనున్నారని తెలిపారు. ఈ సమావేశం సందర్భంగా ఎపి ఐఆర్ఐఏ జనరల్ బాడీ మీటింగ్‌లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారని ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ బుజ్జిబాబు (హెచ్.ఓ.డి., కె.జి.హెచ్.), ప్రొఫెసర్ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ వర్మ (హెచ్.ఓ.డి., అపోలో ఆసుపత్రులు), డాక్టర్ రఘు (గీతం కళాశాల) పాల్గొన్నారు.

## 3న కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా

**- కమిషనర్ కి నోటీసు ఇచ్చిన కాంట్రాక్టర్లు**

**విజయనగరం,అక్టోబర్30( వెలుతురు):**

నగర పాలక సంస్థ లో పలు అభివృద్ధి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు కు రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేసి, నవంబర్ 3 తేదీన నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య కు నోటీసు ఇచ్చినట్లు కాంట్రాక్టర్లు తెలియజేశారు. గురువారం ఉదయం కమిషనర్ కు నోటీసు కాంట్రాక్టర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము గత 2 సంవత్సరములుగా పూర్తి చేసిన పనులుకు ఈ నాటి వరకు బిల్లులు చెల్లింపులు జరగలేదన్నారు. దీనివలన మేము ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు.



అయినప్పటికినీ మీరు మమ్ములను పిలిచి క్రొత్తపనులకు టెండర్లు వేయండి పనులు చేసిన వెంటనే పేమెంటు ఇస్తానని చెప్పి మాట ఇచ్చారన్నారు. కానీ మేము సకాలంలో పనులు పూర్తి చేసినప్పటికి నేటి వరకు మాకు పేమెంటులు ఇవ్వటం జరగలేదన్నారు. గత బిల్లులు పేమెంట్సులు రాక క్రొత్త బిల్లులకు పేమెంటులు ఇవ్వకపోవడం వలన బ్యాంకుల నుండి మరియు ఇతర వ్యక్తుల నుండి తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని, మానసిక ఒత్తిడికి లోనువుతున్నామన్నారు. ఎన్ని ఇబ్బందులు పడుతున్నా మామీద త్వరితగతిన పనులు చేయమని మీరు మరియు ఇంజనీరింగు విభాగం వారు ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. అంతే కాకుండా మాకు నోటీసులు జారీచేస్తుయున్నారన్నారు. ఈ విషయమై మా కోర్ కమిటీ సభ్యులు తమ పిలుపుమేరకు తే 25-10-2025ది శనివారం నాడు మధ్యాహ్నం 2 గంటలకు మీరు సమావేశం నిర్వహించారు. కానీ మీరు మాకోర్ కమిటీ సభ్యులు చర్చించిన అంశాలు పై మీ నుండి మాకు సానుకూల స్పందన రాకపోవటం వలన తే 03-11-20258 సోమవారం నుండి ప్రస్తుతం చేస్తున్న పనులు నిలుపుదల చేసి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసు ఎదుట దర్నా చేయుటకు నిర్ణయించుకొని ఈ నోటీసు ద్వారా తెలియజేస్తున్నామన్నారు. నోటీసు ఇచ్చిన వారిలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టులు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.బంగార్రాజు, అర్.రాజ్కుమార్, గౌరవ అద్యక్షులు ఎం.లింగారావు, పి.అశోక్, సబ్యులు నరేంద్ర,పి.శ్రీనివాసరాజు, డి.శ్రీనివాస్, వాసుదేవరావు, కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాస్, సత్యన్నారాయణ, సబ్యులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్‌తో భారీగా నష్టం

**- చెరువులుగా మారిన ఊరువాడలు**

**- భారీగా పంట నష్టం వాటిల్లినట్లు అంచనా**



**సిద్దిపేట, అక్టోబర్30( వెలుతురు):**

మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిస్తున్నాయి. హుజురాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశవపట్నం వాగు ఉప్పొంగడంతో ఐకేపీ కేంద్రం గోడ కూలి నిల్వ ఉంచిన వరి ధాన్యం కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. వాగు ఉప్పొంగడంతో.. సైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. హుజురాబాద్‌లో కూడా చిలుకవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో.. జూపాక రోడ్డు తెగి పోయింది. భారీ వర్షం కారణంగా రోడ్డుపై ఆరబెట్టిన వడ్లు కూడా కొట్టుకుపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్ కారణంగా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా భారీగా పంట నష్టం వాటిల్లింది. కుండపోత వర్షాలకు వరంగల్ – ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. దీంతో ఆ రూట్‌ని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. తుఫాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ తడిసి ముద్దయింది. అలాగే.. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలల్లో వరి పంటకు అపార నష్టం వాటిల్లింది. చేర్యాల మండలంలో.. భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముస్త్యాల వద్ద రాగికుంట పొంగిపొర్లడంతో చేర్యాల – హుస్నాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా.. భారీగా ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మద్దూర్‌లో 22 సెం.మీ, దూల్మిట్ట 19 సెం.మీ, చేర్యాల 17సెం.మీ, కొమురవెల్లి 12సెం.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే చాలా జిల్లాల్లో వరి ధాన్యం, మొక్క జొన్న పంటలు, చేతి కొచ్చిన పత్తి పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

## పులిచింతలకు భారీగా వరదనీరు

**- ప్రకాశం బ్యారేజి వద్ద పెరుగుతున్న వరద**

**అమరావతి,అక్టోబర్30( వెలుతురు):**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు పులిచింతల ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. ప్రాజెక్ట్‌కు 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో.. అధికారులు 4 లక్షల 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే ప్రకాశం బ్యారేజ్‌కు 2 లక్షల 74 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరింది. దీంతో అధికారులు బ్యారేజ్ అన్ని గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజ్‌కు మున్నేరు, కీసర, వైర, కట్టలేరు నుంచి సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. సాయంత్రానికి ప్రకాశం బ్యారేజ్‌కు పులిచింతల నుంచి సుమారు 4 లక్షల 80 వేల క్యూసెక్కుల వరద నీరు చేరుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజ్‌కు సాయంత్రానికి సుమారు 5 నుంచి 6 లక్షల క్యూసెక్కుల వరద చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో బ్యారేజ్ దిగువ భాగాన ఉన్న కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలలోని నదీతీర మండలాలు, గ్రామాల ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. లంక గ్రామాల ప్రజలు అలర్ట్‌గా ఉండాలని అధికారులు కోరారు. భారీ వర్షాలకు కృష్ణానది వరద ప్రవాహం పెరుగుతోందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ వద్ద దిగవకు వరద నీటి విడుదల చేసినట్లు చెప్పారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతానికి ఇన్ ఎ÷–లో, ఔట్ ఎ÷–లో 2.74 లక్షల క్యూసెక్కులుగా ఉందన్నారు. బ్యారేజ్ వద్ద సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని.. వరద ఎ÷–లో 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. క్రమక్రమంగా వరద తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో లంక గ్రామ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని.. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నదిలో ప్రయాణం, ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం లాంటివి చేయరాదని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.

## కరూర్ ఘటన తరవాత మళ్లీ ప్రజల్లోకి విజయ్

**- పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్న నేత**



**చెన్నై,అక్టోబర్30( వెలుతురు):**

కరూర్ రోడ్‌షోలో 41 మంది దుర్మరణం సంఘటన తర్వాత పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న తమిళగ వెట్రి కళగం నేత విజయ్ మళ్ళీ పార్టీ వ్యవహారాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవల కరూర్ మృతుల కుటుంబ సభ్యులను మహాబలిపురం రిసార్ట్‌కు రప్పించి వారికి క్షమాపణ చెప్పి, గాయపడిన వారికి తలా రూ.2లక్షలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన తర్వాతే ఆయన ధాన్యం కొనుగోలు వ్యవహారంపై డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సుదీర్ఘ ప్రకటన చేశారు. బుధవారం సాయంత్రం పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై 28 మంది సభ్యులతో కొత్త కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా సాగించాలని ఆయన నిర్ణయించారు. ఆ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అధ్యక్షతన పనయూరులోని పార్టీ కార్యాలయంలో కొత్త కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ నిర్వాహక కమిటీ తొలిసమావేశం సాఫీగా సాగిందని, మళ్ళీ పార్టీ వ్యవహారాలను చురుకుగా కొనసాగించాలని పార్టీ నాయకులంతా సూచించినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. కరూర్ దుర్ఘటన పార్టీ వ్యవహారాలను పూర్తిగా స్తంభింపజేసిందని, ఆ శోకం నుండి పూర్తిగా బయటపడి పార్టీ నాయకుడు విజయ్ మళ్ళీ చురుకుగా పార్టీపై దృష్టిసారిస్తున్నారన్నారు. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంటారా? అని విలేఖరుల ప్రశ్నించగా, నెల రోజులకు ముందు పార్టీ ఏ స్థితిలో ఉండేదో ఆ స్థితిలోనే పార్టీ వ్యవహారాలు కొనసాగుతాయని ఆ పార్టీతో పొత్తు లేనట్లేనని సూచన ప్రాయంగా నిర్మల్‌కుమార్ తెలియజేశారు.







Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com